



చిత్రగుంట : ఫిషింగ్‌హార్బర్ ప్రగతిపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు జనార్దన్, ఆనం తదితరులు

3, 4 నెలల్లో ఫిషింగ్ హార్బర్ పూర్తి

- జగన్ ప్రభుత్వం వల్లే పనుల ఆలస్యం
- పనుల పరిశీలనలో రాష్ట్ర మంత్రి జనార్దన్



గుడ్లూరు : పోర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

చిత్రగుంట, ఆగస్టు 2: మూడు, నాలుగు నెలల్లో జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్‌హార్బర్ పనులు పూర్తిచేసి, మత్స్యకారులకు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయ ల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ పనులను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి జనార్దన్ పరిశీలించారు. పెండింగ్ పనుల పరిశీలకు వచ్చిన మంత్రు లకు కలెక్టర్ ఆనంద్, కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, ఆర్డీవో శీనానాయక్ స్వాగతం పలికారు. పూర్తయిన, కావల్సిన పనుల వివరాలను అధికారులతో కలిసి కలెక్టర్ మంత్రులకు వివరించారు. హార్బర్ నిర్మాణ నమూనాను పరిశీలించిన అనంతరం హార్బర్ ముఖద్వారం వరకు వెళ్లి సముద్ర అలల తాకిడి, జరిగిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి జనార్దన్ మాట్లాడుతూ తీర ప్రాంత మత్స్యకా రుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని అన్నారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన జరిగిందన్నారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూడేళ్లలో పూర్తి కావల్సిన పనులు ఇంతవరకు కాలేదని అన్నారు. పెండింగ్ పనుల విషయంలో కలెక్టరు, సంబంధిత అధికారులతో చర్చించామని మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేసి మత్స్యకారులకు అందజేసేలా కృషి చేస్తామన్నారు. మంత్రి ఆనం మాట్లాడుతూ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామయపట్నం పోర్టు, దగదర్తి విమానాశ్రయం ప్రాజెక్టులను పూర్తిచేసి నెల్లూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. జిల్లాకు 3 జాతీయ రహదారులు అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. వీలైనంత త్వరగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచన అని అన్నారు. మంత్రుల వెంట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఐఅండ్‌ఐ కార్యదర్శి సురేష్‌కుమార్, మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, మత్స్య శాఖ జేడీ నాగేశ్వరావు, కావలి ఏడీఎఫ్ శ్రీనివాసులు, కావలి డీఎస్పీ వెంకటరమణ డిప్యూటీ తహసీల్దారు జూలియాభాయ్, మత్స్యకార నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● రామాయపట్నం పోర్టు పరిశీలన

గుడ్లూరు : రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి పరిశీలించారు. తొలుత అధికార యంత్రాంగం, పోర్టు నిర్వాహకులతో వారు సమీక్షించారు. వీరివెంట కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, వెంకట కృష్ణారెడ్డి, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, టీడీపీ నేతలు బీద రవి చంద్ర, అబ్దుల్ అజీజ్, సురేష్‌కుమార్, పోర్టు అధికారులు పాల్గొన్నారు.



'సోమశిల'కు 5,169 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, ఆగస్టు 2 : ఎగువ నుంచి సోమశిల జలాశయానికి వస్తున్న కృష్ణా జలాల వరద తాకిడి పెరిగింది. తొలిరోజు 3వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా శుక్రవారం నాటికి 5,169 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇదే ప్రవాహం కడప జిల్లా ఆదినిమ్మయపల్లి గేజి వద్ద 10 వేల క్యూసెక్కులుగా ఉంది. దీంతో శనివారం సాయత్రానికి సోమశిలకు వచ్చే ప్రవాహంలో మార్పు కనిపించే అవకాశం ఉన్నట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. రోజువారీగా ఒక టీఎంసీ నీరు ప్రాజెక్టుకు చేరితే ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న నీటి సమస్యలను అనతికాలంలో అదిగమించవచ్చని యంత్రాంగం భావిస్తుంది. కాగా, జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 9.893 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

15 నుంచి బీఎస్ఎన్ఎల్ 4జీ

- పాత టారీఫ్‌లకే ఈ సేవలు
- జిల్లాలో 32 కొత్త టవర్ల ఏర్పాటు
- రెండేళ్లలో 5జీ సేవలు తీసుకొస్తాం
- డీజీఎం శ్రీనివాసులు వెల్లడి



4జీ గోడపత్రికలను ఆవిష్కరించిన డీజీఎం శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 2 :ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను జిల్లాలో ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డిప్యూటీ జీఎం శ్రీనివాసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం సాయంత్రం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పూర్తిగా స్వదేశీ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో 4జీ సేవలు వినియోగ దారులకు అందజేస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 324 టవర్లు ఉండగా, అదనంగా 32 కొత్త టవర్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో 184 టవర్లను 4జీకి మార్పు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 2.7 లక్షల మంది వినియోగదారులు ఉండగా, 44వేల మంది మినహా మిగిలిన వారందరూ 4జీ సిమ్‌లకు మారిపోయారని తెలిపారు. గత నెలలో 16 వేల మంది ఇతర నెట్వర్క్ లకు చెందిన వినియోగదారులు పోర్టుబులిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌ను ఎంచుకున్నారని తెలిపారు. రాబోయే రెండేళ్లలో పూర్తిగా 5జీ సేవలు అందించాలన్న లక్ష్యంతో 5జీ సాంకేతిక పరికరాలనే వాడుతున్నట్లు తెలిపారు. ఖర్చుకు వెనుకాడడంలేదని పాత టారీఫ్‌ల ద్వారానే 4జీ సేవలు వినియోగదారులకు అందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ రికార్డులన్నీ సక్రమంగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : అటవీ శాఖ రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ సీసీఎఫ్ (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) శ్రీనివాస రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని అటవీ శాఖ కార్యాలయంలో అధికారులు, కార్యాలయ సిబ్బందితో సీసీఎఫ్ సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, పథకాల అమలు, మొక్కల ప్లాంటేషన్ తదితర విషయాలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా జామాయిల్ టెండర్ల ద్వారా అటవీశాఖకు, వీఎస్ఎస్‌లకు వచ్చిన లాభాల వివరాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేయలన్నారు. ఎర్రచందనం రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పులుల సంరక్షణకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీఎఫ్‌వో చంద్రశేఖర్, రేంజర్లు మాల్యాద్రి, రవీంద్రబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శాకాంబరిగా దర్శనం ఇచ్చారు. వివిధ రకాల కాయగూరలు, పండ్లతో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులు బారులుతీరి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇసుక కొరత తీరినట్టే!

- బ్యారేజీల వద్ద డీసీల్టేషన్‌కు ఆమోదం
- మూడు చోట్ల చేపట్టాలని నిర్ణయం
- ప్రభుత్వానికి చేరిన డీఎల్ఎస్‌సీ నిర్ణయాలు
- అనుమతి వచ్చిన వెంటనే తవ్వకాలు ప్రారంభం



సంగం వద్ద డీసిల్టేషన్‌కు ప్రతిపాదించిన పాయింట్

నెల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుక కష్టాలు త్వరలో తీరనున్నాయి. ఈ నెలలోనే మూడు ప్రాంతాల్లో డీసిల్టేషన్ ప్రక్రియ మొదలుపెట్టనున్నారు. దీనివల్ల ఇసుక కొరత తీరడంతోపాటు ధర కూడా భారీగా తగ్గనుంది. పెన్నా బ్యారేజీ డీసిల్టేషన్‌ను పోతిరెడ్డిపాలెం వద్ద, సంగం బ్యారేజీ డీసిల్టేషన్‌ను సంగం, సూరాయపాలెం వద్ద నిర్వహించాలని జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) లో తీర్మానించారు. కలెక్టర్ ఓ ఆనంద్ నేతృత్వంలో ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, భూగర్భ నీటి శాఖలతో కూడిన డీఎల్ఎస్‌సీ సమావేశాలు ఇప్పటికి నాలుగు దఫాలు జరిగాయి. రీచ్‌ల నిర్వహణకు పర్యావరణ అనుమతులు రావడం ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో వాటి స్థానంలో డీసిల్టేషన్ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్ణయించారు. పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం వద్ద డీసిల్టేషన్‌కు ఆమోదం తెలుపుతూ జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపింది. అక్కడి నుంచి అనుమతులు రాగానే ఇసుక తవ్వకాలు మొదలు కానున్నాయి. ఈ నెలలోనే వీటిని ప్రారంభించేందుకు వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి.

● అనుమతుల్లేక తవ్వకాలకు బ్రేక్

పేరుకేమో జిల్లాలో ఎనిమిది ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వాటితోపాటు సంగం వద్ద డీసిల్టేషన్ పాయింట్‌లోనూ ఎన్నికల ముందు వరకూ తవ్వకాలు జరిగాయి. కానీ ఒక్కదానిలో కూడా ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేవు. గత వైసీపీ ప్రభుత్వం ఈ అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా తవ్వకాలు జరిపింది. అసలు ఎంత తవ్వారు..? అన్నదానికి లెక్కలు కూడా లేవు. నాడు భారీ ధరకు ఇసుకను విక్రయించారు. అదే సమయంలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు నిత్యం వందల లారీల ఇసుక జిల్లా నుంచి తరలివెళ్లింది. ఈ క్రమంలో పలువురు పర్యావరణవేత్తలు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అక్కడ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలినా ఇసుక తవ్వకాలు మాత్రం ఆగలేదు. దీంతో ఇంకొందరు సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో తవ్వకాలకు బ్రేక్ పడింది. అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నివేదికలు అందజేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో 18 ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని గుర్తించి మైనింగ్ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆ జాబితాలో విరువూరు, సూరాయపాలెం, గొల్లకందుకూరు, మినగల్లు, వెంకటేశ్వరపురం, కోడూరుపాడు, లేగుంటపాడు, పల్లిపాడు, ముదివర్తి, వేగూరు, మన్నేటికోట, రాళ్లపాడు, కలవళ్ల రీచ్‌లు, ప్రాంతాలు ఉన్నాయి. ఎన్నికల తర్వాత ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పర్యావరణ అనుమతులు లేనిదే రీచ్‌లలో తవ్వకాలు జరపకూడదని నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లాలో ఉన్న రీచ్‌లకు పర్యావరణ అనుమతుల కోసం అధికారులు కేంద్ర ప్రభు త్వానికి దరఖాస్తు చేశారు. వాటికి ఆమోదం లభించేం దుకు రెండు, మూడు నెలల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు.

● వెంటాడుతున్న వైసీపీ పాపాలు


వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు ప్రజలను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ఇసుక తవ్వకాలకు నాడు పర్యావరణ అనుమతులు తీసుకొని ఉంటే ఇప్పుడు ఎటువంటి ఆటంకాలు లేకుండా రీచ్‌లలో తవ్వకాలు జరిపేందుకు అవకాశం ఉండేది. అదే జరిగి ఉంటే ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం ప్రజలకు మంచి ఫలితాలను అందించి ఉండేది. ప్రస్తుతం రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకపోవడంతో యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను నిర్మాణ రంగానికి ఇబ్బంది లేకుండా విక్రయించాలని నిర్ణయించారు. మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు యార్డుల్లో 1.75 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉండగా విక్రయాలు ప్రారంభించారు. పల్లిపాడు, మినగల్లు యార్డుల్లో ఇసుక నిల్వలు అయిపోయాయి. ఇప్పుడు మర్రిపాడు యార్డులో మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. ప్రభుత్వం టన్నుకు రూ.370 నిర్ణయించగా యార్డు వద్ద ట్రాక్టర్ ఇసుక కొనుగోలు రూ.1600 పడుతోంది. జిల్లాలోని అనేక ప్రాంతాలకు ఈ యార్డు దూరం కావడంతో రవాణా చార్జీలే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పోతిరెడ్డిపాలెం, సూరాయపాలెం, సంగం వద్ద డీసిల్టేషన్ పాయింట్లు ప్రారంభమైతే ఇసుక ధరలు భారీగా తగ్గుతాయి. సూరాయపాలెం పాయింట్ నుంచి సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలకు, సంగం పాయింట్ నుంచి ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాలకు, పోతిరెడ్డిపాలెం పాయింట్ నుంచి నెల్లూరు సిటీ, రూరల్, కోవూరు నియోజకవర్గాలకు ఇసుకను తక్కువ ధరకు అందించేందుకు వీలు కలుగుతుంది.

ట్రాక్టర్ ఇసుక రూ.3500

● కందుకూరులో జోరుగా అక్రమ రవాణా

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో ప్రజలకు ఇసుక కష్టాలు తీరడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా అందుబాటులో నిల్వలు ఉన్నా ఇసుక కావాలంటే రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అని ప్రకటించినా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల కాకపోవటం, రీచ్‌ల గుర్తింపు జరగకపోవటంతో ఇసుకాసురుల పంట పడుతోంది. నిత్యం పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తున్నా అక్రమార్కుల్లో మాత్రం మార్పు రావడం లేదు. మరోవైపు పోలీసులు, సెబ్ అధికారులు కూడా మామూళ్లకు అలవాటు పడి ఇసుక రవాణాకు పచ్చజెండా ఊపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కందుకూరులో ట్రాక్టరు ఇసుక రూ.3500 పలుకుతుండటం, కొంతమంది దర్జాగా ఇసుక తోలుతున్న పరిస్థితి చూస్తుంటే ఈ విమర్శలకు బలం చేకూరుతోంది. ఇసుక నిల్వలు ఉన్న పాలేరు, మన్నేరు, ఉప్పుటేరులలో రీచ్‌లను గుర్తించకపోవటంతో అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. మన్నేరులో రాళ్లపాడు రిజర్వాయరుకు ఎగువన మొగిలిచర్ల, గొల్లపాలెం, రాళ్లపాడుకు దిగువన చీమలపెంట, వీఆర్ కోట, అన్నెబోయిన పల్లి, అంగిరేకులపాడు, సీతారామపురం, దప్పళం పాడు, పరకొండపాడు, మాచవరం, పాలూరు - దొండపాడు, బీమవరం, మన్నేటికోట, ఆత్మకూరు, ఉలవపాడు గ్రామాల వద్ద అనధికారిక రీచ్‌లు ఉన్నాయి. వీటిలో పాలూరు - దొండ పాడు, ఆత్మకూరు, దప్పళంపాడు, మాచవరం, చీమల పెంట, మొగిలిచర్ల రీచ్‌ల నుంచి గత ఐదేళ్లలో భారీగా ఇసుక రవాణా సాగింది. అలాగే పాలేరులోను జిల్లెలమూడి, పందలపాడు, విక్కిరాలపేట, పలుకూరు వెంకన్న పాలెం గ్రామాల వద్ద రీచ్‌ల నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా జరిగింది. ఇక ఉప్పుటేరు నుంచి కూడా పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా వ్యవ హారం నడిచింది. ఇటీవల మన్నేరులో దప్పళంపాడు వద్ద ఎక్స్‌కవేటర్‌తో భారీ టిప్పర్లకు లోడుచేసి ఇసుక అక్రమ రవాణాకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్న వ్యవహారం చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల్లో కనీసం మన్నేరులో నాలుగైదు చోట్ల, పాలేరు, ఉప్పుటేరులలో కనీసం మూడేసి చోట్ల ఇసుక రీచ్‌లను అధికారికంగా గుర్తించకపోతే యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతుందని భావిస్తున్నారు. ఆ దిశగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణాకు చెక్‌పెట్టాలని సామాన్యులకు అందుబాటు ధరలో ఇసుక వచ్చేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆరు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం



గుడ్లూరు : పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

గుడ్లూరు : ఎలాంటి అనుమతులు లేకుండా, పూరేటిపల్లి మన్నేరు రేవు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఓ ఎక్స్‌కవేటర్‌ను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పూరేటిపల్లి దగ్గర మన్నేరులో ఉన్న ఇసుకను వలేటివారిపాలెం మండలానికి చెందిన కొందరు శుక్రవారం తెల్లవారు జామున తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటనా స్థలికి పోలీసులు చేరుకుని ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆరు ట్రాక్టర్లను, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేయడంతో పాటు కందుకూరు కోర్టులో వారిని హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు రూరల్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 2: నెల్లూరు రూరల్ డిఎస్పీగా ఘట్టమనేని శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్ ఎస్ఐగా ఘట్టమనేని శ్రీనివాసరావు పోలీసు శాఖలో చేరారు. జిల్లాలో కృష్ణపట్నం పోర్టు సీఐగా, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. తిరుపతి పీటీసీ డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఇటీవల జరిగిన డిఎస్పీల బదిలీల్లో నెల్లూరు రూరల్ డిఎస్పీగా నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు నెల్లూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నెల్లూరురూరల్ : నెల్లూరురూరల్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఘట్టమనేని శ్రీనివాసరావు శుక్రవారం నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన కార్యాలయానికి వచ్చిన పుష్పగుచ్ఛం అందచేసి అనంతరం ఆయన భేటీ అయ్యారు.

వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 2 : లైసెన్స్ ఆధారంగా వాహన మిత్ర పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని నవాబుపేట నుంచి ఏబీఎం కాంపౌండ్ వరకు ఆటో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్ హిట్ అండ్ రన్ చట్టం-106 ఆటో డ్రైవర్ల మెడకు ఉరితాడుగా మారనుందన్నారు. ఆటో కార్మికులపై అధిక ఫెనాల్టీ వేసే జీవో నెంబర్ 21ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 16, 17, 18వ తేదీలలో నెల్లూరు నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సురేష్, నగర కార్యదర్శి మురళి, రాంబాబు, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహా, నివాస్, రాజు పాల్గొన్నారు.

జీవో నెంబరు 77 రద్దు చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 2 : గత ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబరు 77 రాష్ట్రంలోని పీజీ విద్యార్థులకు గుదిబండగా మారిందని, దానిని తక్షణం రద్దు చేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జర్నలిస్టు భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆ జీవోను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ హామీని 2024 -25 విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తేజ, సోషల్ మీడియా కన్వీనర్ వినయ్, రాష్ట్ర నాయకులు గోపి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణకు కృషి చేయాలి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 2 : జిల్లాలో హెచ్‌ఐవీ నియంత్రణకు వైద్యాధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్ వలి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని నవజీవన్ స్వచ్ఛంద సంస్థను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శివ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

పొదలకూరు, ఆగస్టు 2 : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ స్థాపించి 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 10న నెల్లూరు టౌనుహాలులో నిర్వహించే విద్యావైజ్ఞానిక జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు ఎస్‌కె ఎండీ రియాల్ కోరారు. శుక్రవారం మండలంలోని మరుపూరు, తోడేరు, చాటగొట్ల, పొదలకూరు, ఇనుకుర్తి పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి జిల్లా మహాసభలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పిచ్చిబాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.సురేంద్రరెడ్డి, ఐఫియా చీఫ్ ప్యాట్రన్ కె.సుబ్బారెడ్డి, ఫెడరేషన్ బాధ్యులు బాలకృష్ణారెడ్డి, నాగరాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్

నెల్లూరు(జడ్పీ), ఆగస్టు 2 : పొదలకూరులో ఈనెల 6వ తేది ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు నెల్లూరు రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ సోమశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదలకూరులోని గేట్ సెంటర్ వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెసెల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై రాతపూర్వక ఫిర్యాదు ద్వారా తెలియపరిచి సమస్యలను పరిష్కరించుకోవచ్చు పేర్కొన్నారు.

బియ్యం పంపిణీపై సర్వే

మనుబోలు, ఆగస్టు 2: ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీపై ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఇన్ చార్జి తహసీల్దార్ శివప్రసాద్ అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, గృహాలవద్ద రేషన్ బియ్యం పంపిణీ గురించి ఆరా తీశారు. మండలవ్యాప్తంగా 25మందిని సర్వే చేసి అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌వోలు మురళీధర్, శ్రీనువాసులు పాల్గొన్నారు.


అన్నను హత్య చేసింది తమ్ముడే!

● ఫిర్యాదులో పేర్కొన్న తల్లిదండ్రులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 2: ఒకే తల్లి రక్తం పంచుకు పుట్టిన ఇద్దరు అన్నదమ్ముళ్ల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో అన్నను తమ్ముడే హత్య చేసిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు.. నగరంలోని నవాబుపేట ప్రాంతానికి చెందిన దంపతులు బిరుదోజి ముత్యాలు, చంద్ర ప్రస్తుతం వెంకటరమణ హోటల్ ఎదురుగా శివప్రియ హోటల్ వెనుక వైపు తిప్పరాజువీధిలో నివాసం ఉంటున్నారు. వారికి రాజేష్(34), ఈశ్వర్‌లు కుమారులు. ఈశ్వర్ కరెంట్ పనులు చేస్తుండగా రాజేష్ మద్యానికి బానిసై నిత్యం మద్యం మత్తులో ఉండే వాడు. ఈనేపథ్యంలో ఈనెల 1వ తేది మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో రాజేష్ తలపై తీవ్రగాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బీ.అశోక్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను విచారించగా మద్యం సేవించి తానే గాయాలు చేసుకుని మృతి చెందాడని పోలీసులకు తెలిపారు. వారి మాటలు నమ్మని పోలీసులు వారిని పోలీసు స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారణ చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. గురువారం రాజేష్ ఫూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి హోమ్ థియేటర్‌లో సౌండ్ పెంచి పాటలు వింటుండగా అదే సమయంలో మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఈశ్వర్ భోజనం చేస్తూ రాజేష్‌ను సౌండ్ తగ్గించాలని ప్రాధేయపడినా పట్టించుకోలేదు. దీంతో అన్నదమ్ముల మధ్య వివాదం మొదలై కోపోద్రిక్తుడైన ఈశ్వర్ వంట గదిలోకి వెళ్లి చపాతి కర్ర, కత్తి తీసుకొని అన్నపై విచక్షణ రహితంగా దాడి చేశాడు. తల్లిదండ్రులు అడ్డువచ్చినా వారిని తోసేశాడు. తలపై తీవ్రగాయాలతో ఆపస్మారక స్థితిలో ఉన్న రాజేష్‌ను అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం నగరంలోని రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న లారీ

● లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు



కావలి రూరల్, ఆగస్టు 2: గౌరవరం సమీపంలో శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్సును మినీలారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు రక్తగాయాలయ్యాయి. అతన్ని హైవే మొబైల్ అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. బస్సులోని ప్రయాణీలకు ఎలాంటి గాయాలు కాలేదు. అమరావతి నుండి తిరుపతి వెళ్తున్న తిరుపతి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు గౌరవరంలో ప్రయాణికుల కోసం రోడ్డు పక్కన ఆపే క్రమంలో వెనుకనే వస్తున్న లారీ డ్రైవర్ లింగయ్య వాహనాన్ని అదుపు చేయలేక ఈ ప్రమాదం జరిగింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	110
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	230
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6713
వెండి కిలో ధర	రూ. 85,900
వెండి ఒక గ్రాము	రూ. 87.90

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: గండిపాళెం గ్రామానికి చెందిన బుడుంగుంట్ల చినవెంగయ్య (55) శుక్రవారం రాత్రి విద్యుత్ ఘాతానికి గురై మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గండిపాళెం జలాశయ అతిథిగృహం వద్ద నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజులాగా విధులకు హాజరయ్యేందుకు ముందు స్నానం చేయడానికి తన నివాసంలోని బాత్‌రూంకు వెళ్లాడు. ఆ రూంలోకి విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను ప్రమాదవశాత్తు తాకి అక్కడికక్కడే కుప్పకూలి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని బయటకు తీసుకొచ్చారు. సమీపంలోని ప్రైవేటు వైద్య సిబ్బందితో పరీక్షలు నిర్వహించారు. వారు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిన వెంగయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

- యాప్‌లో గర్భిణుల వైద్య వివరాలు నమోదు
- వైద్యసేవలపై ఎప్పటికప్పుడు ఆడియో సందేశాలు
- వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధులపై సమగ్ర నమోదు

'కిల్కారి' సేవలో మనమే ఫస్ట్



మొబైల్‌లోని 'కిల్కారి' యాప్‌లో గర్భిణి వివరాలు నమోదు చేస్తున్న ఆశా కార్యకర్త

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 2 : గత ఏడాది జనవరిలో జాతీయ స్థాయిలో ప్రవేశ పెట్టిన కిల్కారి మొబైల్ సేవలలో నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గర్భిణులు, ఇతర వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాల అమలు తదితర వివరాలు కిల్కారి మొబైల్ యాప్‌లో ఆశా కార్యకర్తలు నమోదు చేస్తారు. ఇక రెండవ స్థానంలో కర్నూలు, 3వ స్థానంలో అనంతపురం జిల్లాలు నిలిచాయి. కిల్కారి మొబైల్ అకాడమి సేవలను మరింత విస్తృతం చేయడానికి ఆశా నోడల్ అధికారులకు శిక్షణ ఇవ్వగా వీరు ఆశా కార్యకర్తలకు మరోసారి శిక్షణ ఇవ్వనున్నారు.

● యాప్ సేవలు ఇలా..

జిల్లాలో మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ఎలాంటి వైద్యం చేయించుకోవాలి. ఎప్పుడెప్పుడు ఆసుపత్రులకు వెళ్లాలి. అలాగే నవజాతా శిశువులకు వ్యాధినిరోధక టీకాలు ఎప్పుడు వేయాలి వంటి హెచ్చరికలు వాయిస్ మెసేజ్ ద్వారా తెలియచేసే యాపే ఇది. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ యాప్ వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తోంది. ఈ యాప్‌లో ఎలాంటి సమచారం నమోదు చేయాలి.. ఎప్పుడెప్పుడు నమోదు చేయాలతో తదితర వివరాలపై ఆశా కార్యకర్తలకు వైద్యాధికారులు శిక్షణ ఇచ్చారు. నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో గర్భవతులను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలి. జిల్లావ్యాప్తంగా 1885 మంది ఆశా కార్యకర్తలు ఉండగా, రెండు లక్షలమందికిపైగా ఈ యాప్‌లో నమోదు చేశారు.

● సందేశాలు ఇలా..

మూడవ నెల గర్భం దాల్చినప్పటి నుంచి పుట్టిన చిన్నారికి ఏడాది వయసు వచ్చే వరకు ఈ కిల్కారి విధానంలో మొబైల్ ఆరోగ్య సేవలు అందనున్నాయి. గర్భం, జననం, చిన్నారుల సంరక్షణపై 72 ఆడియో సందేశాలు యాప్ ద్వారా అందిస్తున్నారు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే 012445880 నుంచి కాల్ వచ్చినప్పుడు ఏదైనా పనిలో ఉండి పూర్తిగా వైద్య చికిత్సల సందేశం వినలేక పోతే 14423 కి కాల్ చేసి మిగిలిన సమాచారం తెలుసుకోవచ్చు.

అధికారులు, ఆశాల తీరుతోనే..



కిల్కారి మొబైల్ యాప్ సేవలలో రాష్ట్రం లోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ యాప్ ద్వారా జిల్లాలో అధికారుల పర్యవేక్షణ, ఆశాల పనితీరు కారణంగా ఈ గుర్తింపు వచ్చింది. గర్భిణులు, చిన్నారులు ఎలాంటి వైద్య సేవలు పొందాలి? ఎప్పుడప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి వంటి విషయాలను వాయిస్ మెసేజ్ ద్వారా తెలియచేస్తుంది. తద్వారా గర్భిణులు, చిన్నారులు వెంటనే వైద్యసేవలు పొందే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ పెంచలయ్య డీఎంహెచ్‌వో

- అధికారం లేకపోయినా వైసీపీ నాయకుల భూదందా
- దుత్తలూరు రెవెన్యూ పరిధిలో భూకబ్జాల పర్వం
- అధికారులకు టీడీపీ నాయకుల ఫిర్యాదు
- అన్నీ తెలిసి చోద్యం చూస్తున్న అధికారులు

ఆక్రమించు.. అనుభవించు!



ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు చదును చేసిన దృశ్యం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 2 : అధికారం లేకపోయినా కొందరు వైసీపీ నాయకులు భూ దందాకు తెరదీశారు. ఏకంగా ప్రభుత్వ భూముల్లో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు. భారీ యంత్రాలతో ప్రభుత్వ భూములను చదును చేసి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. దుత్తలూరు రెవెన్యూ పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నా రెవెన్యూ యంత్రాంగం కన్నెత్తి చూడటం లేదు. చివరకు టీడీపీ నాయకుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

● కబ్జాల పర్వం

దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో సారవంతమైన భూములు ఉన్నాయి. ఎకరా సుమారు రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు పలుకుతోంది. దీంతో గతంలో అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ మేత, పోరంబోకు, భూములపై కన్నేసి కబ్జాలకు తెరదీశారు. అప్పట్లో ఏకంగా ప్రభుత్వ భూములు ఆక్రమించి కంచె ఏర్పాటు చేయడంతోపాటు బోర్లు వేసి సాగు సైతం చేశారు. అప్పట్లో కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు పరిశీలించి ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా వారు బేఖాతరు చేసి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా ఇటీవల కొందరు వైసీపీ నాయకులు బరితెగించి సర్వే నెం. 2471, 2460, 2101, 2472లలో ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

● టీడీపీ నాయకుల ఫిర్యాదు

వైసీపీ నాయకుల భూదందాను ఇటీవల టీడీపీ మండల నాయకులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో 2103, 2463, 2464, 2465, 2466, 2467 ,2468, 2469, 2470, 2472 సర్వే నెంబర్లలో వందల ఎకరాలను కొంతమంది ఆక్రమించుకొని కంచెలు ఏర్పాటు చేసి బోర్లు వేశారని, వారిపై చర్యలు చేపట్టి ప్రభుత్వ భూములు కాపాడాలని వినతిపత్రం అందజేశారు. గతంలో అధికారులు సదరు భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఆ భూములను పరిశీలించి అర్హులైన నిరుపేదలకు పంచాలని, లేదంటే ఆందోళనలు చేయడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూముల ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే అధికారులను పంపి పరిశీలన చేసి ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటాం.

- శీనానాయక్, ఆర్డీవో, కావలి

జడ్పీలో ఉద్యోగులకు పదోన్నతి



ఉత్తర్వులు అందుకుంటున్న ఉద్యోగులు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 2 : జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు సీనియర్ సహాయకులు, ఒక వీడీవో జీఆర్-1కి పరిపాలన అధికారులుగా పదోన్నతి కల్పించి శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడు కే.లక్ష్మీనరసింహంను పదోన్నతిపై చిట్టమూరు పరిపాలన అధికారిగా, జిల్లా నీటి యాజమాన్య సంస్థలో సీనియర్ సహాయకుడు షేక్ అబ్దుల్ రజాక్‌ను జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా, దామరమడుగు పంచాయతీలో వీడీవో జీఆర్-1గా పని చేస్తున్న రామ్మోహన్‌రావు చిల్లకూరు పరిపాలన అధికారిగా పదోన్నతిపై బదిలీ చేశారు. వీరు శుక్రవారం జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం ఆరుణమ్మ, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జడ్పీ డిప్యూటీ సీఈవో బీ చిరంజీవి చేతులమీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పెంచలయ్య, వీ.దేవప్రసన్నకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కుబడి విధులొద్దు.. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు!

● హెచ్‌ఎంల సమావేశంలో డీఈవో రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

నెల్లూరు (విద్య), ఆగస్టు 2 : మొక్కుబడి విధుల నిర్వహణపై కఠినంగా వ్యవహరిస్తామని, అలాంటి వారిపై చర్యలు తప్పవని డీఈవో రామారావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా విద్యాశాఖ అధికారులతో డీఈవో సమావేశమై మాట్లాడారు. పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎంఈఓలు, హెచ్‌ఎంలు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. బడిఈడు పిల్లలంతా ఖచ్చితంగా బడిలో ఉండేలా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. అవసరమైన గ్రామాల్లో సైతంపర్యటించి తల్లిదండ్రులను ఒప్పించి పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. అలాగే పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్మాణాలు ఆగిన చోట రెడ్‌రిబ్బన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలెవరూ ఆ ప్రాంతాలకు వెళ్లకుండా పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది పర్యవేక్షించాలన్నారు.

● ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంచాలి

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నడిచే ఓపెన్‌స్కూల్‌లో ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని డీఈవో సూచించారు. జిల్లావ్యాప్తంగా అభ్యసనా కేంద్రాల్లో కూడా తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టడంతో పాటు అభ్యాసకులకు అర్థమయ్యే రీతిలో వారిని ఒప్పించి తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తరువాత పూర్తి జాబితాను జిల్లా కార్యాలయానికి అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారులు, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, డీవీఈఓ, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

● అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం



అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేస్తున్న రవికుమార్ మాదిగ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 2 : దశాబ్దాలుగా అణచివేతకు గురైన ఎస్సీ ఉపకులాలకు ఎంతో ఊరటనిస్తూ ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలకు అనుమతినిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందని అరుంధతి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేమూరు రవికుమార్ మాదిగ అన్నారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని కోరారు. గతంలో విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్లన్నింటిలో వర్గీకరణ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్వాసకోశ వ్యాధులకు ఆధునిక చికిత్సపై అవగాహన

నేడు, రేపు సదస్సుల నిర్వహణ



మాట్లాడుతున్న డాక్టర్ పిట్టి మల్లికార్జున

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 2 : శ్వాసకోశ వ్యాదులకు ఆధునిక చికిత్సపై శని, ఆదివారాలు రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పల్మనాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ పిట్టి మల్లికార్జున తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాగుంట లేఅవుట్‌లోని అనిల్ గార్డన్స్‌లో పల్మనాలజిస్ట్ వర్క్‌షాప్‌తో పాటు సైంటిఫిక్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి ఎందరో శ్వాసకోశ వ్యాధుల నిపుణులు పాల్గొని తమ అనుభవాలను ఆధునిక విధానాలను వివరిస్తారని చెప్పారు. బ్రాంకోస్కోపి, థోరాసిన్ స్కోపి వంటి వైద్య విధానాలపై వివరిస్తారని వెల్లడించారు. ఇలాంటి శస్త్ర చికిత్సలు గతంలో చెన్నై అపోలో, యశోధ ఆసుపత్రులలో జరిగేవన్నారు. ఇలాంటి వర్క్‌షాప్ ద్వారా నెల్లూరు లోనూ శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో 600 మంది వైద్య నిపుణులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. వైద్యులు, వైద్య విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ మౌర్య, డాక్టర్ ప్రైమ్‌దీప్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎస్పీ



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 2: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది కోసం గ్రీవెన్స్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ఈ కార్యక్రమంలో వారి సమస్యలను నిర్భయంగా తెలియజేయవచ్చన్నారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీసు కార్యాలయ అధికారులు వెంటనే స్పందించి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్పీని కలిసిన మాలమహానాడు నేతలు : నూతనంగా జిల్లాకు వచ్చిన ఎస్పీ కృష్ణకాంత్‌ను మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య, తదితరులు శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. దళితుల సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి కట్టేటి మోహన్‌కృష్ణ, జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, యువజన అధ్యక్షుడు శరత్, తులసి, తదితరులు పాల్గొన్నారు.

బూడిద బల్కర్లను అడ్డుకున్న గ్రామస్థులు



గ్రామస్థులు నిలిపివేసిన బూడిద బల్కర్లు

ముత్తుకూరు, ఆగస్టు 2: బూడిద తరలిస్తున్న బల్కర్లు, టిప్పర్లను బలిజపాలెం గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామాల్లో బూడిద వెదజల్లుతూ కాలుష్యంతో నింపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మితిమీరిన వేగంతో వెళుతున్న బల్కర్ ఆటోను ఢీకొనడంతో ఆగ్రహించిన గ్రామస్థులు బల్కర్లను అడ్డుకున్నారు. కనీసం టిప్పర్‌లకు పట్టలు కట్టకుండా రవాణా చేస్తుండడంతో గాలికి బూడిద ఇళ్లలోకి వస్తోందన్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బూడిద బల్కర్లు, టిప్పర్లు తమ గ్రామం గుండా వెళ్లేందుకు వీలులేదని పట్టుబట్టారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని బూడిద కాలుష్యం బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరారు.

వెంటాడే కుక్కలు.. కుమ్మేస్తున్న ఆవులు!

- పట్టణంలో ఇబ్బందికర పరిస్థితులు
- పట్టించుకోని అధికారులు



ఉదయగిరి బస్టాండ్ నడిరోడ్డుపై ఆవులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: పట్టణంలో వీధికుక్కలు, ఆవులతో ప్రజలు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా వీధుల్లో సంచరిస్తుండడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజల చేతుల్లో తీసుకెళ్లే కవర్లను సైతం లాగేస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా పోలీస్‌స్టేషన్, తహసీల్దారు కార్యాలయాల సమీపంలో చికెన్ దుకాణాలు ఉండటంతో అక్కడ పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తూ వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. కుక్కల అరుపులతో రాత్రులు నిద్ర కూడా సరిగా ఉండటంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇక పగలురాత్రి అనే తేడా లేకుండా మెయిన్‌బజార్, పంచాయతీ బస్టాండ్, గండిపాళెం మార్గంలోని ప్రధాన రహదారులపై ఆవుల సంచారం అధికమైంది. రాత్రి సమయంలో పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఆవుల గుంపులుగా చేరి కుమ్ములాడుకుంటూ ప్రజలపై వస్తున్నాయి. ఆవులు వాహనాల రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పట్టణప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు నివారించాలని, ఆవులు వీధుల్లో సంచరించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం లేదని మండిపడుతున్నాయి. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో ప్రజలు అధికారులపై మండిపడ్డారు. అధికారులు వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇటీవల జరిగిన సంఘటనలు..

- పట్టణంలోని బాలాజీనగర్, యాదవపాళెం ప్రాంతాల్లో ఓ ఆవును పిచ్చికుక్క కరవడంతో దానికి పిచ్చెక్కింది. దీంతో పలువురు మహిళలు, వృద్ధులపై ఆవు విచక్షణారహితంగా దాడి చేయడంతో గాయపడ్డారు.
- బస్టాండ్ ప్రాంతంలో ఆవుల కుమ్ములాటలో పలువురు వాహనదారులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి.
- పట్టణంలోని యూనియన్‌రోడ్డు, గాజుల వీధి, సినిమాహాలువీధి ప్రాంతాల్లో ఇటీవల చిన్నారులు, మహిళలపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి.

వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలు నిర్వీర్యమై పేదల పొట్టకొట్టి పెద్దలకే పంచిపెట్టారని ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ అన్నారు. శుక్రవారం ఉదయగిరి మత్స్యకార సహకార సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం 217 జీవోను రద్దు చేయడంతో పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయం ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని 217 జీవోను రద్దు చేసి మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగు నింపారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జలాశయాలకు నిర్వహణ నిధులు కూడా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇటీవల మంత్రి రామానాయుడు కావలి కాలువ పూడికతీతకు నిధులు మంజూరు చేయాలని కోరగా రూ.15కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించారన్నారు. పంచాయతీ వ్యవస్థను సర్వనాశనం చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని 143పంచాయతీల్లో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.381 కోట్లు మంజూరవగా విద్యుత్ బిల్లుల పేరుతో రూ.200 కోట్లను దారి మళ్లించారన్నారు. చివరికి వైద్యశాలలో నిధులను సైతం స్వాహా చేశారని మండిపడ్డారు. నియోజకవర్గంలోని పాఠశాలలు, రోడ్ల అభివృద్ధి చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. పెద్దిరెడ్డిపల్లి, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పూర్తి చేసి ప్రతి కుటుంబానికి శుద్ధజలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.ఉమాసాయిరాం, ఆర్.వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, నరసింహారావు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు చెన్నరాయుడు, రాముడు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణకు పునాది చంద్రబాబే

ఎస్సీ వర్గీకరణకు పునాది వేసింది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో దుత్తలూరు సెంటర్‌లో శుక్రవారం బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాది, మోహన్‌రావు మాదిగ గంగటప్ప సింహాద్రి, వడ్లపల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వం నమోదు

కలువాయి, ఆగస్టు 2: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం జనసేన క్రియాశీల సభ్యత్వం నమోదును మండల పార్టీ అధ్యక్షులు మనోహర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన వీర మహిళ తోకల ప్రవళిక, నాయకులు నరేష్, హరిప్రసాద్, రామ్‌కిషోర్, నాగయ్య, శ్రీహరి, సురేష్, శ్రీనాథ్, శివాజీ పాల్గొన్నారు.

ఘనంగా బళ్లారి రాఘవ జయంతి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ప్రముఖ రంగస్థల, సినీ నటుడు బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి జీ.రమేష్, సీనియర్ ప్రొఫెసర్లు గోపి కృష్ణ, పాల్, సునీత, కిషన్‌తేజ పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి ఆరుద్రనక్షత్ర పూజలు

సంగం, ఆగస్టు 2: స్థానిక తిరుమనకొండలో వెలసిన రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢమాసం ఆరుద్ర నక్షత్ర పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. పూజల్లో ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి, భక్తులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళులు



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం, ఆగస్టు 2: చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురే ష్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, రమణ రాజు పాల్గొన్నారు.

భోజనశాల మంజూరుకు వినతి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: గండిపాళెం గురుకుల పాఠశాలకు భోజనశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు శుక్రవారం ప్రిన్సిపాల్ పుష్పరాజ్, పూర్వ విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వారు భోజనశాల పూర్తి శిథిలావస్థకు చేరి కూలేదశలో ఉందని, విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని వివరించారు. స్పందించిన ఆయన నూతన భోజనశాల భవనం మంజూరుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యమంలో పూర్వ విద్యార్థులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, విజయభాస్కర్‌రెడ్డి, సుమన్, రవి, కూర్మయ్య, కిరణ్ పాల్గొన్నారు.

పోలీసుల నీడలో పీర్ల మహోత్సవం

వరికుంటపాడు, ఆగస్టు 2: విరువూరు పీర్ల మహోత్సవం శుక్రవారం పోలీసుల నీడలో నిర్వహించారు. గతంలో ఉత్సవాల నేపథ్యంలో వివాదాలు చోటుచేసుకోవడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సీఆర్‌పీఎఫ్ బలగాలతో నిఘా ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పీర్లను ముస్తాబు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పశువులకు సబ్సిడీపై బీమా

వింజమూరు, ఆగస్టు 2: పశుపోషకులు సబ్సిడీపై బీమా ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు తెలిపారు. మండలానికి 50ఆవులు లేదా గేదెలకు అవకాశం కల్పించారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ చేసుకోవాలంటే రైతుసేవా కేంద్రాల వద్ద పశుసంవర్ధక శాఖ సహాయకులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభ

వింజమూరు, ఆగస్టు 2: పట్టణంలోని సుబ్రహ్మణ్యం విద్యా సంస్థల ఇంజనీరింగ్ విభాగంలో 2023-24 సంవత్సరంలో ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 233మంది విద్యార్థులకు 218మంది విద్యార్థులు ఇంజనీరింగ్ సీట్లు సాధించినట్లు కళాశాల చైర్మన్ బి.సురేంద్రరాజు తెలిపారు.

తల్లిపాలు అమృతంతో సమానం

ఆత్మకూరు, ఆగస్టు 2: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగిస్తే అమృతంతో సమానమని సీడీపీవో సునీలత తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం వాశిల సెక్టార్ పరిధిలోని బి.చిరువెళ్ల ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం గర్భవతులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కళావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నారాయణమ్మ, ఏఎన్ఎంలు జ్యోత్స్న పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: గడ్డంవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ షాను గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, రమా, సుజాత, రేణుక పాల్గొన్నారు.

దుత్తలూరులో: నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరీష్, ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు

ఆత్మకూరు, ఆగస్టు 2: స్థానిక మార్కెట్‌యార్డు కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్సీ సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి భూసార పరిరక్షణ పెంపొందించుకోవడం, ఏడాది పొడవున పొలంలో పంట వుండేలా సాగు చేయాలని సూచించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ, వివిధ తెగుళ్ల బారీన పడకుండా పొలంలో వాడే కషాయల తయారీ విధానాలను వివరించారు. విచక్షణా రహితంగా ఎరువులు వాడకంతో కలిగే నష్టాలను విపులీకరించారు. కార్యక్రమంలో మండల వ్యవయ సాయ అధికారి శైలజ, ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, మండల వ్యవసాయశాఖ అధికారి కిషోర్‌బాబు, సీఆర్పీ సుబ్బరాయుడు, మాస్టర్ ట్రైనర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కల్పిస్తూ తీర్పు ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవాసమితి అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఏబీఎం ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ పోరాట ఉద్యమంలో ఎందరో జాతిబిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో అభినందనసభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జాషువా, బాలగురవయ్య, ఆనందరావు, అశోక్, బీజేపీ నాయకుడు రోశయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆ సంఘం మాజీ మండల కన్వీనర్ చేవూరి రవితేజ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు తాతిపూడి లాబాన్, చేవూరి సుకుమార్, నూనె ప్రసాద్, సర్పంచ్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

వింజమూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలదే నిర్ణయం అని సుప్రీంకోర్టు తీర్పునీయడం సంతోషదాయకరమని ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరావు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన మాట నిల బెట్టుకుని వారి హామీలు నెరవేర్చారని ఇదే ఆయన ఘనతే అన్నారు.

అనంతసాగరం: ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు ఆమోద ముద్ర వేయడంతో అనంతసాగరంలో సంబరాలు జరుపుకున్నారు. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చినట్లు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రానికి అనాథ మహిళ

బిట్రగుంట, ఆగస్టు 2: బోగోలు మండలం విశ్వనాథరావుపపేట పంచాయతీలోని ఇబ్రహీంపేట ఆర్అండ్‌బీ రోడ్డు సమీపంలో పడి ఉన్న మతిస్థిమితం లేని అనాథ మహిళను శుక్రవారం భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు సింహాద్రిరావు ఆదరణ కేంద్రానికి తరలించారు. ఆకలితో అలమటిస్తూ చెత్తకుప్పలో పారేసిన భోజనాన్ని తింటున్న ఆ మహిళను గుర్తించి కాంద్ర సతీష్ నాయుడు, కావాటి శ్రీననివాసులు ద్వారా సింహాద్రిరావు తెలుసుకున్నాడు. మాటలు కూడా అర్థంకాని ఆమెను ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీకు కారులో తరలించారు. రెండు కాళ్లు సచ్చుపడి నడవేని స్థితిలో ఉన్న ఆమెకు స్నానం చేయించి తల వెంట్రుకలను కత్తరించి భోజనం చేయించారు. అనాథ మహిళ ఆచూకీ తెలిపి ఆమె ప్రాణాలను కాపాడిన వారికి కేంద్ర నిర్వాహకులు సింహాద్రి భవానీలు ధన్యవాదాలు తెలిపారు.

3కే రన్‌ను విజయవంతం చేయండి

బిట్రగుంట, ఆగస్టు 2: బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7గంటలకు నిర్వహిస్తున్న 3కే రన్ విజయవంతం చేయాలని బీజడ్‌పీ అధ్యక్షుడు ఎం.సత్యన్‌రాజు పిలుపునిచ్చారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీలు వయసును బట్టి ఆరు విభాగాలుగా ఏర్పాటు చేశామన్నారు. అంతే కాకుండా బాలికలు, మహిళలకు పోటీ ఉంటుందన్నారు. నాలుగు వందల మందికి పైగా పోటీలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు కే.శ్రీనివాసులు, సభ్యులు ఆంతోణిరాజ్, సత్యనారాయణ చార్యులు, ఎం.శ్రీనివాసులు ఉన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నాయకులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం అందించాలన్నారు. 70శాతం భూములను కౌలు రైతులు సాగు చేస్తున్నందున వారికి ధ్రువపత్రాలు ఇవ్వడంతో పాటు రైతుభరోసా, పెట్టుబడిసాయం, రుణాలు అందించాలన్నారు. ఏళ్ల తరబడి సాగుతున్న పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల విధానాన్ని తొలగించాలన్నారు. ఈ నెల 9న దేశవ్యాప్తంగా రైతుసంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ కార్యక్రమం అనే నినాదంతో ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అధ్వానంగా రాళ్లపాడు కుడి కాలువ రోడ్డు



కంకర లేచిపోయి అధ్వానంగా ఉన్న రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డు

లింగసముద్రం, ఆగస్టు 2: రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డుపై కంకర లేచిపోయి, గుంతలమయమై అధ్వానంగా ఉండడంతో అధికారులు, సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుడి కాలువ మొదటి నుండి కాలువ చివరి వరకు 20 కి.మీ పొడవున ఉన్న ఈ రోడ్డు గుంతలమచ కావడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. 2012వ సంవత్సరంలో కాలువ మొదటి నుంచి రెండు కి.మీ పొడవున అధికారులు మట్టి రోడ్డును మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఆతర్వాత నుండి ఈ రోడ్డు అభివృద్ధి కోసం తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవు. దీంతో ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణానికి నరకప్రాయంగా తయారైంది. ముఖ్యంగా ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది కాలువకు నీరు విడుదల సమయంలో బ్రాంచి కాలువలకు, పంట పొలాలకు నీటి నిర్వహణకు ఈ రోడ్డును ఉపయోగిస్తారు. అలాగే రైతులు కూడా తమ పంటల సాగు సమయంలో, పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకోనేందుకు ఈరోడ్డే ఆధారం. రాళ్లపాడు గ్రామస్థులు కూడా నిత్యావసర వస్తువుల కోసం, ప్రభుత్వ కార్యాలయాలకు ఈ రోడ్డు మీదుగానే లింగసముద్రం వస్తుంటారు. దీంతో అధ్వాన్నంగా ఈ రోడ్డుపై వారు అగచాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల జాబితాలో గ్రామకంఠం భూములు

- రిజిస్ట్రేషన్లు జరగక ప్రజల ఇబ్బందులు
- గ్రామకంఠం భూముల జాబితాలోకి మార్చాలని ప్రజల వినతి

లింగసముద్రం, ఆగస్టు 2: లింగసముద్రంలోని 79 సర్వే నంబరులోని గ్రామకంఠం భూములను సుమారు ఎనిమిదేళ్ల క్రితం అప్పటి కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది అనాలోచితంగా ప్రభుత్వ భూముల జాబితాలో నమోదు చేశారు. దీంతో ఆ సర్వే నంబరులోని నివాసాల వారు ఆస్తులు, స్థలాలు, ఇళ్లు అమ్ముకోవాలన్నా, కొనాలన్నా రిజిస్ట్రేషన్లు జరగక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు గురువారం లింగసముద్రం వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన తగిన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ టి ప్రసాద్‌ను ఆదేశించగా, తగిన సవరణల కోసం ఫైలును జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించామని చెప్పారు. తాను కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు.

తల్లిపాల వారోత్సవ ర్యాలీ



తల్లిపాల వారోత్సవాల ఆవశ్యకతను తెలియచేస్తూ నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

కావలి, ఆగస్టు 2: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సౌజన్య ముసునూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం శుక్రవారం తల్లి పాల వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు వెంటనే ముర్రు పాలు తాపి స్తే వ్యాధి నిరోదకశక్తి పెరిగి శిశువు ఆరోగ్యకరంగా ఎదుగుతారన్నారు. స్త్రీలు గర్భవతిగా ఉన్నపుడు సమతుల్యమైన అద నపు ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు రాధాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, దీనా కుమారి, సుకన్య, ప్రభావతి, శివలీల, సుశీల పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని మాలకొండ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవా రం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఐసీడీ ఎస్ అధికారులు, కార్యకర్తలు తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం వజ్రమ్మ, అంగన్‌వాడీ కార్య కర్త పార్వతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అల్లూరు: తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని కావలి సీడీపీవో సౌజన్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అల్లూరు సెక్టారు పరిధిలోని అల్లిమడుగు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. శిశువుకు తల్లిపాలను అందిస్తే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. తల్లికి రొమ్ము కేన్సర్, గర్భసంచి కేన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. శిశువు ఎదుగుదల, మెదడు ఎదుగదల, మధుమేహం, రక్తహీనత తదితర అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఆరోగ్య సిబ్బంది రాజ్యలక్ష్మి, మహిళా పోలీస్ శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు లలితమ్మ, ప్రసూన, జమీన్ పాల్గొన్నారు.

కందుకూరు: మండలంలోని మాచవరం అంగన్వాడీ సెంటర్- 2లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ ప్రభావతి కార్యక్రమానికి హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి అంజయ్య, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం మంజుల, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పుపై బీజేపీ సంబరాలు



ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు రావడంపై బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శుక్రవారం బుడమగుంట ఎస్సీ కాలనీలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రధాని నరేంద్ర మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు దేశచరిత్రలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. ఎస్సీలందరికీ సమాన హక్కులందాన్న ఆశయంతో ప్రధాని మోదీ మొదట్నుంచి వర్గీకరణకు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బ్రహ్మానందం, రాష్ట్ర నాయకులు వీవీ రంగారెడ్డి, పూనూరు మాధవి, మందా కిరణ్, సవీంద్ర, మందా శ్రీనివాసులు, తూమాటి తిరుపతిస్వామి పాల్గొన్నారు.

ఉలవపాడు: సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీల వర్గీకరణకు సానుకూలత ఏర్పడినందున ఎస్సీలలోని ఉప కులాలకు మేలు జరిగిందని బీసీ సంఘం నాయకుడు మిరియం శ్రీను, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు రావినూతల ముత్తుమాదిగలు అన్నారు. శుక్రవారం ఉలవపాడు మండలంలోని కరేడు ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు కరేటి గోపాల్, ఆలూరి కోటేశ్వరరావు, పున్నేపల్లి శ్రీను, కరేటి ఏలియా, గడ్డం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కావలి: రాష్ట్ర ప్రభుత్వాలే ఎస్సీ వర్గీకరణ చేసుకునే అవకాశం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగల 30 ఏళ్ల కల ఫలించిందని ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు పట్టణంలోని ట్రంకురోడ్డులో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పరుసు రమేష్, చేవూరు మాల్యాద్రి, దావులూరి దేవకుమార్, దావులూరు జేమ్స్, రావినూతల శింగయ్య, మోహన్‌రావు, గోసాల చిట్టి, పరుసు మాల్యాద్రి, గోసాల మధు, వెంకటస్వామి పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



కావలి టౌన్, ఆగస్టు 2: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ సందరర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ వైద్యులు ప్రభాకర్ నాయు డు, సంస్థల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషతో కలిసి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతావని సగర్వంగా ఆవిష్కరించుకునే మువ్వన్నల జెండా రూపశిల్పి మన తెలుగు బిడ్డ కావడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మొగల్ సిరాజ్‌బేగ్, పీవీ రమణయ్య, ఖాదర్‌బీ, దామ మధుసూదన్‌రావు, పీవీఎస్ ప్రసాదరావు, మాలకొండారెడ్డి, బ్రహ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కావలి రూరల్, ఆగస్టు 2: పట్టణంలోని ఉదయగిరిరోడ్డు బుడంగుంట కాలనీ సమీపంలో శుక్రవారం సాయంత్రం మోటారు సైకిల్.. కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో జలదంకి మండలం లింగరాజు అగ్రహారంకు చెందిన ఆర్.సాయికుమార్ కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికుల సమాచారం మేరకు సాయికుమార్ మద్యం సేవించి మోటారు సైకిల్‌పై కావలి నుంచి జలదంకి వైపునకు వెళుతూ ఎదురుగా వచ్చిన కారును ఢీ కొన్నాడు. గాయపడిన అతన్ని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

మంచినీటి సమస్య పరిష్కారం



సత్యనారాయణపురానికి తాగునీటి సరఫరా పునరుద్ధరించిన అధికారులు

లింగసముద్రం, ఆగస్టు 2: మండలంలోని చినపవని పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వ రరావు పరిష్క రించారు. సత్యనారాయణపురం గ్రామానికి తాగునీరు అందించే బోరు చెడిపోయి సరఫరా నిలిచి పోయింది. దీంతో వారు ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు చినపవని గ్రామ టీడీపీ నేత సోంపల్లి మనోహర్ శుక్రవారం బోరు బాగు చేయించి గ్రామనికి తాగునీటి సర ఫరాను పునరుద్ధరంచారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

శాకాంబరి అలంకరణలో కన్యకా పరమేశ్వరి



అల్లూరు, ఆగస్టు 2: ఆషాఢమాసం ముగించుకొని శ్రావణ మాసంలోకి అడుగెడుతున్న రోజులను పురస్కరించుకుని స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు దమ్మాల వెంకట బ్రహ్మానందరావు, అధ్యక్షులు మొగళ్లపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి యేల్యారి సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడు జాలాది వెకంటేశ్వర్లు, సహ కార్యదర్శి మొగళ్లపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు కలిగిరిలో ఎమ్మెల్యే కాకర్ల పర్యటన

కలిగిరి, ఆగస్టు 2: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరుగనున్న మండల సర్వసభ్య సమావేశానికి ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామన్నారు.

పశువుల షెడ్లకు దరఖాస్తు చేసుకోండి

వలేటివారిపాలెం, ఆగస్టు 2: రైతులు పశువుల షెడ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని వలేటివారిపాలెం పశుసంవర్ధక శాఖ సహాయకులు బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మినీ గోకులం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పశువుల షెడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, అందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పశువుల షెడ్ల నిర్మాణాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బ్రహ్మయ్య తెలిపారు.

రూ. 1.9 కోట్లతో రహదారి, వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు

వలేటివారిపాలెం, ఆగస్టు 2 : మండలంలోని వలేటివారిపాలెం జాతీయ రహదారి నుండి రోళ్లపాడు గ్రామంలోకి తారురోడ్డు, తూమలేరుపై వంతెన నిర్మాణానికి రూ. 1.9 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినట్లు పంచాయతీరాజ్ ఏఈ గోపిచంద్‌రెడ్డి తెలిపారు. వలేటివారిపాలెం నుండి రోళ్లపాడు వెళ్లేందుకు గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే నాగేశ్వరరావు జాతీయ రహదారి నుండి రోళ్లపాడు గ్రామంలోకి తారురోడ్డు, మధ్యలో తూమలేరుపై వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాలని పంచాయతీరాజ్ ఏఈకి సూచించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు పి.ఆర్ ఏఈ తెలిపారు.

కౌలురైతులకు రుణాలివ్వాలి

కావలి, ఆగస్టు 2: కౌలు రైతులకు పంటల సాగునకు పెట్టుబడుల కింద ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు షాన్‌వాజ్, జిల్లా నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కౌలు రైతులకు గుర్తింపుకార్డుల మంజూరు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. భూ యజమానులకు సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గుర్తింపుకార్డులు వచ్చిన వారికి కూడా రుణ సదుపాయం అందించటంలేదని వాపోయారు. వాతావరణంలో వచ్చే విపత్తులతో నష్టపోయిన రైతులకు పంటల బీమాసౌకర్యం కల్పించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రైతుసంఘం కార్యదర్శి రాజగోపాల్, సహాయ కార్యదర్శి శివయ్య, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దర్గాబాబు ఉన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేత

కావలి, ఆగస్టు 2: పట్టణంలోని 12వ వార్డు అరుంధతీయవాడకు చెందిన బీ. బ్రహ్మయ్య అనారోగ్యంతో నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో ఆయన అవసరాలను గుర్తించిన సచివాలయ కార్యదర్శి సురేష్‌కుమార్ వార్డు టీడీపీ ఇన్‌చార్జి దావులూరి దేవకుమార్‌ను నెల్లూరుకు వెళ్లి బ్రహ్మయ్యకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

చంద్రబాబు కృషితోనే సానుకూల తీర్పు : ఎమ్మార్పీఎస్



పొదలకూరు: కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

పొదలకూరు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే కోర్టులో సానుకూల తీర్పు వచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఎస్పీ నాయకులు వంగపాటి సుబ్రహ్మణ్యం మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంగం సెంటర్ రోడ్డు కూడలి నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి పూలమాల వేశారు. అనంతరం పంచాయతీ బస్టాండులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సర్వేపల్లి సీనియర్ నాయకులు చిడదల శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్పీ మాజీ నాయకులు ఆలుపూరు పాపయ్య మాదిగ, ఎంఎస్పీ నాయకులు చిడతల గోపి మాదిగ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: ఎస్సీ వర్గీకరణ హర్షణీయం అని దళిత, ఎన్డీఏ కూటమి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు బుచ్చిరెడ్డిపాళెం జొన్నవాడ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, న్యాయమూర్తులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేత దర్శిగుంట శ్రీనివాసులు, గండి రఘురామయ్య, కాసా శ్రీనివాసులు, ఎంవీ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

అభివృద్ధి పనులు చేపట్టండి

● వివిధ శాఖల అధికారులతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 2 : నియోజకవర్గంలో తక్షణం అభివృద్ధి పనులు చేపట్టాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వైద్యం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, కృష్ణపట్నం పోర్టు, పామాయిల్ ఫ్యాక్టరీ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి పోర్టు, పామాయిల్ ఫ్యాక్టరీ వరకు గతంలో జరిగిన నీటి కేటాయింపులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలకు అవసరమైన నీటిని తరలించేందుకు చేపట్టాల్సిన పైప్‌లైన్ నిర్మాణంపై పలు ఆదేశాలు జారీ చేశారు. జలజీవన్ మిషన్ పురోగతిపై పలు సూచనలు చేశారు. పొదలకూరులోని చిట్టేపల్లి వద్ద టీడీపీ హయాంలో నిర్మించిన మెగా వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి డిస్ట్రిబ్యూటరీ యూనిట్లు, ట్యాంకులు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్‌కు సూచించారు. ఈ నెల 9వ తేదీన వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జిల్లాలో పర్యటిస్తారన్నారు. వెంకటాచలం, పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రాలకు జనరేటర్లు, వాషింగ్ మిషన్, కంప్యూటర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పొదలకూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇస్కపాళెం, వరిగొండ, ముత్తుకూరు, తాళ్లపూడిలో భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మనుబోలు, మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కనుల పండువగా కామాక్షితాయికి నిత్య కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 2: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం ఉదయం గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకి సేవలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్ల పరిశీలన

పొదలకూరు, ఆగస్టు 2: పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం సమీపంలో ఉన్న సర్వే నెంబరు 204, 205, 206లలో వేసిన అక్రమ లేఅవుట్లను నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ ఖాదర్‌బాషా శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి దొరబాబు, రెవెన్యూ అధికారులు, కొనుగోలు చేసి మోసపోయిన బాధితులు ఉన్నారు.

వెంకటాచలం సీఐగా పీ సుబ్బారావు

వెంకటాచలం, ఆగస్టు 2: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా పీ సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని ఎన్డీఏ కూటమి నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

విడవలూరు, ఆగస్టు 2: బీసీ వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని బీసీ సంక్షేమ అధికారిణి ప్రసన్న తెలిపారు. స్థానిక బీసీ సంక్షేమ హాస్టల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అల్పాహారం, భోజన వసతులపై ఆరా తీశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు వేళలు మార్చాలని నిరసన



బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 2: బుచ్చి నగర పంచాయతీలోని వవ్వేరు గ్రామ ప్రజలకు అనుకూలంగా వుండేలా నెల్లూరు - వవ్వేరు ఆర్టీసీ బస్సుల రాకపోకల వేళలను మార్చాలంటూ ఆగ్రామ మహిళలు శుక్రవారం గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సును నిలిపివేసి సుమారు గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

వెంకటాచలం, ఆగస్టు 2 : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దామరమడుగులో చోరీ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 2: మండలంలోని దామరమడుగులో ఘంటసాల శ్రీనివాసులు ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నగలు, నగదు అపహరించుకుపోయినట్టు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. శ్రీనివాసులు చేపల గుంటల మీద కాపలాకు, భార్యబిడ్డలు బంధువుల ఇంటికి వెళ్లగా ఈ చోరీ జరిగినట్టు తెలిపారు.

దొంగకు దేహశుద్ధి

మండలంలోని సాల్మానుపురంలోని ఓ ఇంట్లో గురువారం వేకువజామున చోరీకి యత్నించిన దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నెల్లూరు బోడిగాడితోటకు చెందిన ఈదూరు సునీల్‌గా పోలీసులు గుర్తించారు. ఈమేరకు విచారిస్తున్నట్టు తెలిపారు.

బీచ్ కబడ్డీ పోటీల ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కల్యాణ్ రెడ్డి, సీఐ శ్రీనివాసరావు

ఇందుకూరుపేట, ఆగస్టు 2: క్రీడలతోనే మానసిక ఉల్లాసమని టీ డీపీ యువ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి తెలిపారు. కొత్తూరు ఎంకేఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం పముజుల శ్రీనివాసులు, మహాలక్ష్మమ్మ స్మారక 11 వ రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. టీడీపీ సీనియర్ నాయకుడు కోడూరు కమలాకర్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో కూడా కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కబడ్డీ పోటీల నిర్వాహకులు పముజుల రవి, దాసరి విజయ్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, జనసేన నాయకుడు గుడి హరికుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, బొద్దుకూరు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



ముత్తుకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ముత్తుకూరు, ఆగస్టు 2: ముత్తుకూరులోని ఎస్టీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రయోజనాలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమనమ్మ తల్లులకు అవగాహన కల్పించారు. పుట్టిన అరగంట లోపు బిడ్డకు తల్లిపాలు పట్టాలని, ఆ పాల ల్లో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి, కార్యకర్తలు భాగ్యమ్మ, సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.

●**మనుబోలు:** జట్లకొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనరసింహపురం కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి, జట్లకొండూరు సర్పంచు నాగమ్మ, ఉపసర్పంచు తుల సీరామ్, సూపర్‌వైజర్లు రమణమ్మ, పద్మజ, ఏఎన్ఎం రజిత, ఎంఎల్‌పీహెచ్ సుప్రియ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితుడిపై కేసులు నమోదు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 2: స్థానిక రాఘవరెడ్డి కాలనీలో మహిళపై అత్యాచార, హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిపై వెంటనే కేసులు నమోదు చేయాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన బాధితురాలిని పరామర్శించారు. ఎస్పీ, హోంమంత్రి, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్ళి కఠిన శిక్షలు అమలయ్యేలా చూస్తామని మహిళకు భరోసా ఇచ్చారు. వారి వెంట జనసేన కార్యకర్తలు ఉన్నారు. టీడీపీ నాయకుడు ఎంవీ శేషయ్య తదితరులు బాధితురాలిని పరామర్శించి అన్నివిధాలా అండగా వుంటామని భరోసా ఇచ్చారు. అలాగే బాధిత మహిళను ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల, జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి జి హేనాసుజన ఆదేశాల మేరకు వన్‌స్టాప్ సఖీ సెంటర్ కేస్ వర్కర్స్ లీలావతి, శారద, అడ్వైజర్ షహనాజ్ పరామర్శించి వివరాలు సేకరించారు

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రులను కలిసిన సర్పంచులు, పంచాయతీరాజ్ నాయకులు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 2: రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గోపిరెడ్డి వెంకటేష్‌యాదవ్, విలుకానిపల్లి సర్పంచ్ గోపిరెడ్డి పావని, ముంగలదొరువు సర్పంచ్ చిట్టేటి కవిత, తదితరులున్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం : ఏఈ

ముత్తుకూరు, ఆగస్టు 2: బుడ్డి డ్రైన్‌లో అక్రమ తవ్వకాలపై తగు చర్యలు తీసుకుంటామని ముత్తుకూరు సెక్షన్ డ్రైన్స్ ఏఈ శేషారెడ్డి తెలిపారు. రంగాచార్యుల కండ్రిగ వద్ద బుడ్డి డ్రైన్‌లో తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని సచివాలయం అధికారులు, రైతులతో కలిసి డ్రైన్స్ అధికారులు పరిశీలించారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. స్థానిక రైతులు ఇచ్చిన ఫిర్యాదును తీసుకున్నారు.



కోవూరు: రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

వరి పొలాల పరిశీలన

కోవూరు, ఆగస్టు 2: మండల పరిధి లోని విఘ్నేశ్వరపురం, చెర్లోపాళెం, పాటూ రు గ్రామాల్లోని వరి పొలాలను శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆత్మ డీపీడీ శివ నారాయణ రైతులతో మాట్లాడుతూ మండల పరిధి లోని పొలాల్లో వరిపంట పొట్టదశలో ఉందన్నారు. శాస్త్రవేత్తల సల హాలు పాటించి వరిపైరులో తెగుళ్లను నివారించుకోవాలన్నారు. డాక్టర్ సురేఖ, డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ ఎరువుల యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలన్నారు. రైతులందరూ గుర్తింపు కార్డులు పొందాలని కోరారు. శాస్త్రవేత్తల వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు వ్యవసాయాధికారిణి ఇందిరావతి తదితరులున్నారు.

●**ఇందుకూరుపేట:** మండలంలోని కొత్తూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి డి రఘు నాథ్‌రెడ్డి శుక్రవారం వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సామూహికంగా మందును పెట్టుకుని ఎలుకలను నివారించుకోవాలని సూచించారు. ఆకుముడత పురుగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. త్వరలో ఈపంట (ఈక్రాప్) జరుగుతుందని, ప్రతి రైతు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ మాదయ్య, రైతులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: ఎలుకల నివారణకు సకాలంలో చర్యలు తీసుకోకపోతే నష్టం అధికంగా ఉంటుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బలిజపాలెంలో ఆయన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో స్థానిక రైతులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్నారాణి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సహాయకులు నవీన్, కరీం పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

● అనారోగ్య బాధితుడికి మంత్రి నారాయణ పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 2: అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నేత మురళీమోహన్‌కు పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ భరోసా ఇచ్చారు. శుక్రవారం 16వ డివిజన్‌లో గత కొద్ది కాలంగా తీవ్ర అనారోగ్యంతో ఉన్న మురళీ ఇంటికి వెళ్లి మంత్రి పరామర్శించారు. ఆయ న కుటుంబ సభ్యులు, పిల్లల పరిస్థి తిని తెలుసుకుని ఇద్దరు ఆడపిల్లల చదువు బాధ్యత తనదేనంటూ భరోసా ఇచ్చారు. దీంతో బాధితుడు మురళీమోహన్‌రావ్ మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నేతలు అజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములుకండి : కోటంరెడ్డి



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, ఆగస్టు 2 : మీ ప్రాంత అభివృద్ధిలో ప్రత్యక్ష, పరో క్ష భాగస్వాములై జన్మభూమి రుణం తీర్చుకోవాలని నెల్లూరురూరల్ ఎ మ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం 24వ డివిజన్ కల్లూరిపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో ని రూ.50 లక్షలతో సీసీరోడ్లు, కల్వర్ట నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఈ ప్రాంతాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దత్తత తీసుకున్నందున పనుల ప్రారంభో త్సవాలకు ఆయనను ఆహ్వానిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అరవ శాంతి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే సౌత్‌మోపూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సర్కారు అందించిన స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేత పముజుల దశరథరామయ్య, టీడీపీ నాయకులు రాపూరు చంద్రశేఖర్, పముజుల ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

రేపు కృష్ణాష్టమి పోటీలు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 2 : నగరంలోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ఈనెల 4వ తేదీన చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ్‌స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్లే క్లాస్ నుంచి 10వ తరగతి చిన్నారులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవతామూర్తుల ఫ్యాన్సీ డ్రెస్, భగవద్గీత, శ్లోక కంఠస్థ పోటీలు, శ్రీకృష్ణ భక్తిగీతాలు, చిత్ర లేఖనం, కలర్స్ కలరింగ్, శ్రీకృష్ణాష్టమి గ్రీటింగ్ కార్డులు తయారీ పోటీలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ పాల్గొనాలని కోరారు.

ముగిసిన వార్షికోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 2 : శ్రీగణేష్ సేవా మిత్ర మండలి 19వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. మినీబైపాస్ రోడ్డులో ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. గణేష్ సేవా మిత్రమండలి చైర్మన్ గాలి శ్రీధర్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం మెగా రక్తదాన శిబిరం, విశిష్ట సేవా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో నరసింహ, పరంధామయ్య, పెంచలయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా కంటి వైద్య శిబిరం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 2 : నగరంలోని బాలాజీనగర్ సాయిదర్బార్ (అద్దాల మందిరం) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని మందిరం నిర్వాహకుడు మధుసాయి ఒక ప్రకటనలో తెలిపారు. మోడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శ్రీసాయిమాత అన్నప్రసాద నిలయంలో ఉదయం 9గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న సర్వసభ్య సమావేశం

నెల్లూరు(సాంస్కృతికం) ఆగస్టు 2 : వాసవ కన్యకా పరమేశ్వరి ఆలయానికి సంబంధించిన దాతలు, సభ్యుల జనరల్ బాడీ సమావేశం ఈనెల 18న నిర్వహిస్తామని ఆలయ కమిటీ మాజీ గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ 2018లో ఆలయ పునర్నిర్మాణానికి 4వేల మంది సభ్యులు, 500 మంది దాతలు సహకరించారని తెలిపారు. నిర్మాణానికి సంబంధించి ప్రతి పైసాకు ఈ సమావేశంలో లెక్కలు చెబుతామని తెలిపారు. ఆలయ పాలక మండలి మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ సురేష్ మాట్లాడుతూ 2017 నుంచి ఇప్పటి వరకు ఆలయం అభివృద్ధికి తాము కృషి చేశామ న్నారు. ఇందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కామేశ్వరరావు, జ్యోతిప్రసాద్, ఒమ్మిన మురళీ, పేర్ల జనార్దన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో విలువలు కలిగిన వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 2: రాజకీయాల్లో ఉన్నత విలువలు కలిగిన నాయకుడు రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అని జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాటాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వై రవి, కృష్ణారెడ్డి, నాగరత్నం, పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 2 : బిడ్డలకు రెండేళ్ల వరకు తల్లిపాలు తప్పనిసరిగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వెంకటేశ్వరపురం ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అన్ని విధాల శ్రేష్ఠమని తెలిపారు. తల్లి గర్భవతి అయినప్పటి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు మాధవి, లత, శ్యామల, రాధమ్మ, అరుణకుమారి, పరిమళకుమారి, వాణి, పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో దివ్యాంగులకు వైద్య పరికరాల అందజేత

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 2 : రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రానికి దాత కాశీ సుబ్రహ్మణ్యం, కుమార్తె పూర్ణిమలు శుక్రవారం రూ.50వేలు విలువచేసే వైద్య పరికరాలను అందచేశారు. ఆటవస్తువులు, స్పీచ్, ఫిజియోథెరపి, వృత్తి విద్య, ఎర్లీ ఇంటర్వెన్షన్ వటి పరికరాలు కేంద్రం ప్రిన్సిపాల్ గురునాథరావుకు అందించారు. పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, ఫ్రైడ్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షులు అనిరుద్, ప్రతిమ, మనోజ్, కార్తీక్, రెడ్‌క్రాస్ కార్యాలయం కార్యదర్శి మస్తానయ్య, కో కన్వీనర్ బలరామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిపై నిందలేయడమే కాకాణి దినచర్య

పొదలకూరు, ఆగస్టు 2 : సోమిరెడ్డి కుటుంబంపై నిందలు వేయడమే దినచర్యగా కాకాణి ప్రవర్తిస్తున్నారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా ఓపెన్ కాని సూరాయపాలెం డీసిల్టింగ్ పాయింట్‌లో రూ.100 కోట్ల దోపిడీ ఏంటని ప్రశ్నించారు. ఎవరో సొంత అవసరాల కోసం రెండు ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లడాన్ని రాద్ధాంతం చేయడం ఆయనకే చెల్లిందన్నారు.

ఆండాళ్ అమ్మవారికి ప్రాకారోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో అండాళ్ అమ్మవారికి తిరువాడిప్పూర ఉత్సవాల్లో బాగంగా శుక్రవారం ఉదయం తిరుమంజనం కనుల పండువగా జరిగింది. సాయంత్రం విశేష పూజలు, ప్రాకారోత్సవం, పూలమాలలు మార్పిడి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డిలు, సిబ్బంది పర్యవేక్షించారు.

కన్యకాపరమేశ్వరికి శాకాంబరి అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 2 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వెలసి ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం శాకాంబరి అలంకారం వైభవంగా జరిగింది. అమ్మవారికి 3వేల కిలోల కూరగాయలు, 500 కిలోల కరివేపాకు, 200 కిలోల పుచ్చకాయలు, 300 కిలోల వివిధ రకాల పండ్లతో మూలవర్లు, అంతరాలయం, ప్రాకార దేవతలు, ఉపదేవతలకు అలంకారం చేశారు. ఆలయ అర్చకులు లలిత శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, సహస్ర నామపారాయణం, నక్షత్ర హారతులు జరిగాయి. ఈ కార్యక్రమాలను వాసవీ క్లబ్ నెల్లూరు సిటీ అధ్యక్షుడు చలువాది నాగేశ్వరరావు, కార్యదర్శి పాదర్తి బాలాజీ, కోశాధికారి పబ్బిశెట్టి నందకిషోర్‌లతోపాటు ఆలయ కమిటీ చైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, గౌరవ సలహాదారులు పేగు షణ్ముఖం పర్యవేక్షించారు.

మూలాపేటలో..: మూలాపేట అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శాకాంబరి అలంకారం జరిగింది. మూలవరులతోపాటు ఆలయ ప్రాంగణంలో కూరగాయలు, పండ్లతో అలంకరించి విశేష పూజలు చేశారు.

ఏపీలో కొత్త వైద్య కళాశాలల గురించి వివరించండి?


నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 2 : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త వైద్య కళాశాలల గురించి వివరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర ఆరోగ్యం కుటంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ సమాధాన మిస్తూ ఎన్ఎంసీ వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 13 వైద్య కళాశాలలు గత ఐదేళ్లలో ఎల్ఓపీ కోసం ఎన్ఎంసీకి దరఖాస్తు చేశాయన్నారు. వీటిలో ఆరు వైద్య కళాశాలలు (ఐదు ప్రభుత్వ, ఒకటి ప్రైవేట్) ఎల్ఓపీ పొందినట్లు వివరించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతాల గురించి వేమిరెడ్డి మరో ప్రశ్న వేయగా ఇందుకు అనుప్రియ పటేల్ ఆయుష్మాన్ భారత్ గురించి వివరించారు.

శ్రావణమాసం కరపత్రాల ఆవిష్కరణ

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 2 : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం సాయంత్రం శ్రావణ మాసం వేడుకల కరపత్రాల ఆవిష్కరించారు. ఈనెల 5నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు శ్రావణ మాసం వేడుకలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ బి.వెంకటసుబ్బయ్య తెలిపారు. 4 శుక్రవారాలు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, 4 మంగళవారాలు కాత్యాయనీ వ్రతం, రెండవ శుక్రవారం వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, మాజీ ధర్మక ర్తలు, కొలపర్తి రమేష్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.



ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 3 ఆగస్టు 2024


తహసీల్దారు గదిలో ఊడి పడిన శ్లాబ్

తహసీల్దారు గదిలో శ్లాబ్ ఊడిపడింది!

బిక్కుబిక్కుమంటున్న సిబ్బంది

ఓజిలి, ఆగస్టు 2:ఓజిలి తహసీల్దారు కార్యాలయంలో పనిచేయాలంటే సిబ్బంది హడలి పోతున్నారు. కార్యాలయ భవనం అన్ని గదులూ పగుళ్లు బారి శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండడమే ఇందుకు కారణం. శుక్రవారం కార్యాలయ సిబ్బంది తహసీల్దారు గది తెరిచి అప్పటికే గది శ్లాబు ఊడిపడి ఉండటంతో భయపడిపోయారు. గదికి వేసిన సీలింగ్‌తో పాటు ఊడిపడిన పెచ్చులను తొలగించారు.ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన నాంచారయ్య గత నెల 27న రిలీవ్ అయ్యారు. ఎవరికీ పోస్టింగ్ ఇవ్వకపోవడం... గదిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.కార్యాలయంలోని అన్ని గదులూ ఈనెలు పోసి పగుళ్ళిచ్చి ఉన్నాయి. దాంతోపాటు మరి కొన్ని గదుల శ్లాబులు ఊడిపడేటట్లు లేచి పోయి ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దారు గదిలోని శ్లాబు పలు ప్రాంతాల్లో ఊడి పడి ఉంది. తహసీల్దారు గదిలో శ్లాబ్ పెచ్చులూడి పడిన విషయాన్ని తెలుసుకున్న ఆర్డీవో చంద్రముని కార్యాలయానికి చేరుకుని సిబ్బందితో మాట్లాడారు. ఆయన సమాచారంతో ఆర్‌అండ్‌బీ ఏఈ చెన్నరాయుడు గదిని పరిశీలించారు. కార్యాలయంలో విధులు నిర్వహించడం ప్రమాదకరమని, మరమ్మతులు చేపట్టినా ఫలితం ఉండన్నారు.భవన పరిస్థితిపై అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా

తిరుపతి టీడీపీ పార్లమెంటు కార్యాలయం

● ప్రతి శనివారం అర్జీల స్వీకరణ

తిరుపతి (జీవకోన), ఆగస్టు 2: ప్రజా సమస్యల పరిష్కార వేదికగా తిరుపతి తెలుగుదేశం పార్టీ పార్లమెంటు కార్యాలయం పనిచేయనుందని అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల జగన్ పాలనలో వ్యవస్థలన్నీ కుదేలయ్యాయన్నారు. అన్ని రంగాలు అవినీతిమయంగా మారాయన్నారు. భూములు విచ్చలవిడిగా కబ్జాలకు గురయ్యాయని మండిపడ్డారు. అందువల్ల తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని స్థితిలో బాధితులంతా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు కార్యాలయం వేదికగా అధ్యక్షుడు నరసింహ యాదవ్ నేతృత్వంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా కమిటీ సభ్యులంతా అందుబాటులో ఉండి అర్జీలను స్వీకరిస్తారన్నారు. వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా పార్టీ కార్యాలయం చూసుకుంటుందన్నారు. పార్లమెంటు కార్యదర్శి యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు సలహాలు, సూచనలు వస్తే వాటిని ఐటీ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి.. యువతకు ఉపాధికల్పనే ధ్యేయంగా చూస్తామన్నారు. చేజర్ల మనోహరాచారి, మునిరామయ్య, రాజయ్య, చింతా రంగయ్య, అహ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

26 ప్రైవేటు ల్యాబ్స్ సీజ్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), ఆగస్టు 2: జిల్లావ్యాప్తంగా నిబంధనలు పాటించని 26 ల్యాబులను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. 'ప్రైవేటు ల్యాబుల దందా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై డీఎంహెచ్‌వో శ్రీహరి స్పందించారు. నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ల్యాబులను గుర్తించి, సీజ్ చేయాలని వైద్యాధికారులకు ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 17 బృందాలను ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వోపాటు ఈ బృందాల్లో అధికారులు ఒక్క రోజులోనే 90 ప్రైవేటు ల్యాబులను పరిశీలించారు. వీటిల్లో నిబంధనలు పాటించని 26 ల్యాబులను సీజ్ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో ఈ చర్యలు చేపట్టామన్నారు. ల్యాబుల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లతోపాటు నిబంధనలు పాటించకున్నా, అధిక ధరలు వసూలు చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.మంగళం పరిధి లో జరిగిన తనిఖీల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు జయంతి, స్రవంతి, ఎంపీహెచ్‌ఈవో మురళి, తదితరులు పాల్గొన్నారు.

దండోరా పోరాటముద్రలు



● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1996నుంచి ఉద్యమాలు
● ఫలితం దక్కిందంటూ మాదిగల హర్షాతిరేకాలు

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెనుక దండోరా పేరుతో ఎమ్మార్పీఎస్ చేపట్టి సాగించిన సుదీర్ఘకాలపు పోరాటం ఉంది. ఈ ఉద్యమ సంఘటనలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అనేక ప్రాంతాలు వేదికలయ్యాయి. ఉద్యమ ఉధృతికి సాక్ష్యంగా నిలిచిన కొన్ని సందర్భాల సమాహారం ఇది.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి



●ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1996 నుంచీ ఎమ్మార్పీఎస్ ఉద్యమ కార్యాచరణ మొదలైంది. తొలి కార్యక్రమమే నాటి సీఎం చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లి నుంచీ హైదరాబాదుకు పాదయాత్ర వంటి భారీ కార్యక్రమం కాగా అందులో మంద కృష్ణ మాదిగ స్వయంగా పాల్గొన్నారు.

●2006లో మదనపల్లె నుంచీ ఛలో హైదరాబాదు కార్యక్రమానికి మదనపల్లె దిగువ కమ్మపల్లెకు చెందిన మనిగే రామయ్య రైల్లో వెళుతూ మహబూబ్‌నగర్ వద్ద జారిపడి చనిపోయారు.

●2007లో ఎమ్మార్పీఎస్ ఆందోళనకారులు మదనపల్లె సమీపంలోని అంగళ్ళు వద్ద నాలుగు బస్సులు ధ్వంసం చేసి రెండింటిని తగులబెట్టారు. 32మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొని జైలుపాలయ్యారు. అదే ఏడాది పీలేరు రైల్వే స్టేషన్‌లో సిగ్నల్ రూమ్‌ను తగులబెట్టిన ఘటనలో ఎనిమిది మంది జైలుకు వెళ్ళారు. ఆ ఏడాదిలోనే కలకడ ఎంపీడీవో కార్యాలయాన్ని తగులబెట్టిన ఘటనలో ఆరుగురు క్రిమినల్ కేసులు ఎదుర్కొన్నారు.

● 2008లో అంగళ్ల బస్టాండులో ఆర్టీసీ బస్సును తగలబెట్టేశారు.చిత్తూరులోని టీడీపీ కార్యాలయాన్ని ముట్టడించారు.

● 2009లో కుప్పంలో రైలును అడ్డుకున్న ఘటనలో పోలీసు కేసులు ఎదుర్కొన్నారు. మదనపల్లెలో సెంట్రల్ సెరికల్చర్ కార్యాలయ ఆవరణలో జీపును కాల్చివేసిన ఘటనలో ఆరుగురు జైలుకు వెళ్ళారు. తిరుపతిలో జస్టిస్ ఉషా మెహ్రా పర్యటన సందర్భంగా వర్గీకరణ అనుకూల, వ్యతిరేక వర్గాల నడుమ ఘర్షణ జరిగింది.

● 2010లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ కాన్వాయ్‌ను తిరుపతి ఎన్టీయార్ కూడలి వద్ద అడ్డుకున్న ఘటనలో పోలీసులు జరిపిన లాఠీఛార్జీలో 20 మంది తీవ్ర గాయాలకు గురి కాగా 18 మంది జైలుపాలయ్యారు.

●2011లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా వున్న ప్పుడు ఆయన నియోజకవర్గ కేంద్రమైన పీలేరు నుంచీ హైదరాబాదుకు మాదిగల తిరుగుబాటు రథయాత్ర జరిగింది.

● 2014లో రాయలసీమ జిల్లాల కన్వీనర్ నరేంద్రబాబు మాదిగ ఆధ్వర్యంలో ములకలచెరువు నుంచి సత్యవేడు వరకు పాదయాత్ర చేశారు. అప్పటి ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు దేవరాజులు మాదిగ ఆధ్వర్యంలో కుప్పం నుంచి తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ వరకు పాదయాత్ర చేశారు.

●గతేడాది ఏప్రిల్‌లో తిరుపతిలో జాతీయ మహాసభలు సైతం నిర్వహించారు.



మా పాత్ర సింధువులో బిందువు

పద్నాలుగేళ్ళ నుంచీ ఉద్యమంలో పనిచేస్తున్నా. కార్యకర్తగా చేరి ఇపుడు జిల్లా నేతగా ఎదిగా. లక్షల కుటుంబాలకు మేలు చేసే సముద్రమంతటి ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మేము పోషించిన పాత్ర చిన్న బిందువు లాంటిది. సుప్రీం కోర్టు తీర్పు మా పోరాటాన్ని అర్థవంతం చేసింది.

\-పులికుంట్ల గోపి, తిరుపతి



పాతికేళ్ళ పోరాటం సార్థకమైంది!



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ నాయకత్వంలో పాతికేళ్ళ పాటు సాగించిన మా పోరాటం సుప్రీం కోర్టు తీర్పుతో సార్థకమైంది. చదువును, ఉద్యోగాన్ని, కుటుంబాన్ని కూడా వదిలిపెట్టి ఉద్యమం కోసం పనిచేసినందుకు ఫలితం దక్కింది.నాలాగే ఎంతోమంది నాయకులు చేసిన త్యాగాల పునాదుల మీద మాదిగ ఉప కులాలకు చెందిన లక్షల కుటుంబాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కలగనుండడం పట్ల గర్వంగా వుంది.

\- ఎస్.నరేంద్రబాబు, మదనపల్లె

వర్గీకరణ ఉద్యమాన్ని ఉరకలెత్తించిన నేతలు

ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం తొలినాళ్ళలో జిల్లావ్యాప్తంగా పలుచోట్ల చురుగ్గా సాగింది. ప్రారంభంలో తొలినాళ్ళలో చిత్తూరు బ్యాంకు ఉద్యోగి గిరిధర్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. తరచూ కార్యక్రమాల్లో పాల్గొంటూ విధులకు హాజరు కాలేక చివరికి ఉద్యోగం కూడా పోగొట్టుకున్నారు. తర్వాతి దశలో ఉద్యమానికి మదనపల్లె బలమైన కేంద్రంగా మారింది. ఆ ప్రాంతానికి చెందిన నేత పీటీఎం శివప్రసాద్ ఉద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించారు. జిల్లాలో జరిగిన మిలిటెన్సీ తరహా ఘటనలన్నింటికీ ఆయనే నాయకత్వం వహించారు. ఆ క్రమంలో పలు క్రిమినల్ కేసులను ఎదుర్కొని జైలుపాలయ్యారు.ఈ రెండవ దశలో మదనపల్లెలో టీచర్ మోపూరి కృష్ణప్ప, పాలిటెక్నిక్ విద్యార్థి చలవాది శ్రీనివాసులు, మలారి గిరిబాబు, పీటీఎంలో కేవీ రమణ, పుంగనూరులో మిద్దింటి వెంకటస్వామి, చిత్తూరులో ప్రభుత్వ ఉద్యోగి చెంగయ్య, పాకాలకు చెందిన బాబు, సుగుణమ్మ దంపతులు, కేవీపల్లెలో ముల్లంగి చంద్రయ్య, తంబళ్ళపల్లెలో పాతకోట సుబ్బన్న, తిరుపతిలో గోపీ తదితరులు నాయకత్వం చేపట్టి చురుగ్గా పనిచేశారు. మూడవ దశలో మదనపల్లెలో నరేంద్రబాబు, మంచూరు మారెప్ప, పీలేరులో గండికోట వెంకటేష్, తిరుపతిలో ఒద్దెపోగు రవి, వైకే విశ్వనాధ్, టీటీడీ ఉద్యోగి వెంకటరత్నం, ఎర్రావారిపాలెంలో నడిమికండ్రిగ సుధాకర్, కుప్పంలో దేవరాజు తదితరులు నాయకత్వం వహించి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు.

మా పోరాటం ఫలితాన్నివ్వడం హర్షదాయకం



కేవీబీపురం మండలం కాళంగి గ్రామం నుంచీ 2011లో ఉద్యమంలో చేరా. సమాజం అంటే ఏమిటో తెలియని మా కులానికి ఎమ్మార్పీఎస్ ఉద్యమం సమాజం పట్ల అవగాహన కలిగించింది. సమస్యల కోసం పోరాడే ధైర్యాన్ని, చైతన్యాన్ని రగిలించింది. మా పోరాటం ఫలితాన్ని సాధించడం దానివల్ల లక్షల కుటుంబాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో లబ్ది కలగనుండడం సంతోషాన్నిస్తోంది.

\- సూరిపాక వాసుదేవరావు, కాళంగి

మాదిగలకు నిజమైన స్వతంత్రం



30 ఏళ్ల కల సాకారమైంది. దేశానికి స్వతంత్రం ఎప్పుడో వచ్చినా, మాదిగలకు మాత్రం సుప్రీంకోర్టు తీర్పుతో నిజమైన స్వతంత్రం ఇప్పుడు వచ్చింది.

\- దేవరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు

ఏంటిది గోవిందా?

● విష్ణునివాసంలోని ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో క్యూలైన్ల ఏర్పాటు
● రోడ్లపై బారులు తీరుతున్న వాహనాలు
● తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు

తిరుపతిలోని విష్ణునివాసం ఆవరణలోని ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో క్యూలైన్ల ఏర్పాటుతో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేక బస్సులను వెలుపల సర్వీసు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలతోపాటు బస్సులు కలుస్తున్న కారణంగా రెండు వరుసలుగా పార్కింగ్ విస్తరిస్తోంది. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనివల్ల ట్రాఫిక్ పోలీసుల నుంచి అభ్యంతరం ఎదురవుతుండటంతో డ్రైవర్లు ఒత్తిడికి గురవుతున్నారు.

టీటీడీతో కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం విష్ణునివాసం ఆవరణంలోని ఖాళీ స్థలంలో ఆర్టీసీ బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. దాదాపు 10 బస్సులు వరుసక్రమంలో ఉంటాయి. రైల్వేస్టేషన్ ముందు స్థలం ఖాళీ అవగానే ఇక్కడినుంచి బస్సులు ఒకదాని వెంట ఒకటి ముందుకు కదులుతాయి. ఇలా ప్రతి బస్సుకు దాదాపు అర గంట సమయం పడుతుంది. ఆ సమయంలో డ్రైవర్లు కాసింత విశ్రాంతి తీసుకుంటారు. దాంతో తిరుమల ఘాట్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా బస్సులు నడుపుతూ భక్తులకు సురక్షిత ప్రయాణం అందిస్తుంటారు. ఈ వెసులుబాటుకు మే నెల ఒకటో తేదీన బ్రేక్ పడింది.


విష్ణునివాసం ఆవరణంలో పూర్తిగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

మూడు నెలలుగా వాయిదా..

విష్ణునివాసంలో శ్రీవారి సర్వదర్శనానికి టైమ్‌స్లాట్ టోకెన్లు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. మే నెల నుంచి రద్దీ పుంజుకుంటుందని టీటీడీ భద్రతా విభాగం ముందు జాగ్రత్త చర్యగా ఆర్టీసీకి లేఖ రాసింది. రద్దీని క్రమబద్ధీకరించడానికి పార్కింగ్ స్థలాన్ని క్యూలైన్లు ఏర్పాటుకు అప్పగించాలని కోరింది. ఆ వెంటనే స్వాధీనం చేసుకుంది. నెల తర్వాత అప్పగిస్తామని చెప్పినా అది జరగలేదు. జూన్‌లోనూ కొనసాగింది. జూలైలో వారాంతంలోనూ రద్దీ ఉంటుందని, తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేంతవరకు ఆ క్యూలైన్లు తొలగించమని ఖరాకండిగా చెప్పేసింది. ఇలా పార్కింగ్ స్థలం అప్పగింత విషయం వాయిదా పడుతుండడం ఆర్టీసీ యంత్రాంగాన్ని కలవరపెడుతోంది.

పరిష్కారంపై దృష్టి పెట్టకనే..

ఇక్కడున్న ఖాళీ స్థలాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేసుకుంటే.. మిగిలిన స్థలంలో ఆర్టీసీ బస్సులు పార్కింగ్ చేసుకునే అవకాశముంది. దీంతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అలా చేయకుండా భద్రతా విభాగం తమకు సులువైన మార్గంపైనే ఆధారపడుతోందన్న విమర్శలున్నాయి. అదీగాక అర్ధరాత్రి రెండు గంటలకు టోకెన్ల జారీ ప్రారంభమై ఉదయం ఆరు గంటలకు దాదాపు పూర్తవుతుంది. అప్పటికే వెలుపలున్న భక్తులు విష్ణునివాసం లోపలికి చేరుకుంటారు. ఈ క్రమంలో ఉదయం ఐదు గంటల నుంచే క్యూలైన్లు ఖాళీ అవుతాయి. అంటే ఓ నాలుగు గంటల పాటు రద్దీని క్రమబద్ధీకరించడం బదులుగా స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడంతోనే సమస్య తలెత్తుతోంది. టీటీడీకి దీటుగానే ఆర్టీసీ కూడా భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ఇకనైనా టీటీడీ ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

\- తిరుపతి (ఆర్టీసీ)



తూర్పు భాగంలో స్థలమున్నా ఒకే క్యూలైను ఏర్పాటు చేశారిలా...

అంగన్‌వాడీ హెల్పర్‌పై దాడి

● ముగ్గురిపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 2: పట్టణంలోని జైహింద్‌కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో హెల్పర్‌గా పని చేస్తున్న కవితపై ముగ్గురు యువకులు దాడి చేశారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం మధ్యాహ్నం కవిత విధులు నిర్వహిస్తుండగా అదే కాలనీకి చెందిన మునీంద్ర, శంకర్, హరికృష్ణ మద్యం తాగి వచ్చి గెరిటతో దాడి చేశారు. దీంతో వారిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

కారు ఢీ కొని వృద్ధురాలి మృతి


దయమ్మ మృతదేహం

తడ, ఆగస్టు 1 : కారు ఢీ కొని వృద్ధురాలు మృతి చెందింది. మండల పరిధిలోని చేని గుంటకు చెందిన కె.దయమ్మ(62) శుక్రవారం ఉదయం అల్పాహారం తెచ్చుకునేందుకు దగ్గరలోని హోటల్‌కు రోడ్డు పక్కన నడిచి వెళ్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు రోడ్డు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలపాలై దుర్మరణం చెందింది. అక్కడే ఉన్న వారి సమాచారం మేరకు పోలీసులకు ఘటనాస్థలికి చేరుకొని మృత దేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించండి


సీఐతో మాట్లాడుతున్న దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 2: పోక్సో బాధితులకు అండగా నిలిచి నిందితుడికి కఠిన శిక్షలు అమలయ్యేలా కేసులు నమోదు చేస్తామని రూరల్ సీఐ జగన్ మోహన్‌రావు చెప్పారు. ఓజిలి మండలంలో బాలికపై అత్యాచారయత్నానికి సంబంధించి వృద్ధుడిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు సీఐను కలిశారు. నిందితుడికి కఠిన శిక్షలు అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి విమలమ్మ, ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షురాలు విజయనిర్మల, అధికార ప్రతినిధి సులోచనమ్మ, కార్యదర్శులు సుప్రియ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితుడి అరెస్టు

ఓజిలి, ఆగస్టు 2: బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఓజిలి ఎస్‌ఐ రవిబాబు తెలిపారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ కోసం నాయుడుపేట కోర్టుకు తరలించామన్నారు. నిందితుడ్ని విచారించిన కోర్టు రిమాండు విధించడంతో నెల్లూరు కారాగారానికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

24న గంధమహోత్సవం


కరపత్రాల ఆవిష్కరణలో దర్గా కమిటీ

గూడూరు అర్బన్, ఆగస్టు 2: పట్టణంలోని దర్గా వీధిలోని హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో ఈనెల 24న గంధమహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు దర్గా కమిటీ సభ్యులు తెలి పారు. శుక్రవారం స్థానిక దర్గా ఆవరణలో మహోత్సవ కరపత్రాలను దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం ఉ ఉంటాయన్నారు. రియాజ్‌అహ్మద్, మగ్దూం, సందానీబాషా, షాన్‌వాజ్, గౌస్‌బాషా, షబ్బీర్, యస్థానీ, ఖలీఫా తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించండి

డక్కిలి/ వెంకటగిరి, ఆగస్టు 2: డక్కిలి మండలంలో కుష్ఠు, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. డక్కిలి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తుల వివరాలను వైద్యాధికారి బిందుప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. శరీరంపై పొడలు, మచ్చలు, పుండ్లు ఉన్న ప్రదేశంలో స్పర్శలేకుండా ఉంటే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. డీపీఎంవో రాజేంద్రప్రసాద్, వైద్యాధికారి శ్రీహరి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కుష్ఠు నివారణ అధికారి శ్రీనివాసులు రెడ్డి వెంకటగిరి పట్టణంలోని పాతకోట ఆరోగ్య కేంద్రంలో కుష్ఠువ్యాధి గ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. వైద్యులు రాజా, రమణ, కిరణ్, ప్రసాదరావులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పని సరి


మంగానెల్లూరులో ఈ పంట నమోదు

సూళ్లూరుపేట, ఆగస్టు 2: రైతులు సాగుచేసే పంటలకు తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకురాలు జి.అనిత చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని ఇలుపూరు, మంగానెల్లూరు గ్రామాల్లో పర్యటించి రైతులతో ఈ పంట నమోదుపై గ్రామ సభలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగు వివరాలతో పాటు సర్వే నెంబర్లు వ్యవసాయ అధికారుల ద్వారా ఈ పంట నమోదు చేసుకుంటునే పంటల బీమా పథకం, తక్కువ వడ్డీకే రుణాలు అందుతాయన్నారు. ఏవో కాంచన, గ్రామ వ్యవసాయ సహాయకుడు గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కోట మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో శుక్రవారం ఈక్రాప్‌పై రైతులకు అవగాహన జరిగింది.

ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసం

● కేసు నమోదు

బాలాయపల్లి, ఆగస్టు 2: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని బాలాయపల్లికి చెందిన టి.వెంకట బంగారు ప్రసాద్ చౌదరి అలియాస్ బాబీ నడుపుతుతున్న కన్సల్టెన్సీని మండలానికి చెందిన 19 మంది సంప్రదించారు. న్యూజీలాండ్‌లో ఉద్యోగాలు ఉన్నట్టు తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావు పేటకు చెందిన జి.ప్రశాంత్, రవళి దంపతులు బాబీకి చెప్పారు. దీంతో బాబీ బాలాయపల్లెవాసుల నుంచి విడతల వారీగా రూ.48.38 లక్షలను వారికి పంపారు. వారు నకిలీ వీసాలు పంపడంతో మోసపోయినట్లు గ్రహించి బాలాయపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

వాకాడు, ఆగస్టు 2: మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని శుక్రవారం ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ ఘట్టాలను వేదపండితులు దివి అనంతాచార్యులు భక్తులకు వివరిస్తూ జరిపించారు. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిబాబా స్వామి, సాక్షానందస్వామి, సులభాదేవి, పరిపూర్ణానందస్వామి, గురుబిడ్డలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు పూర్తయ్యేనా?

తడ, ఆగస్టు 2 : గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థకు అవసరమైన కార్యాలయాల్లో కొన్ని అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. తడ మండలంలో మొత్తం 18 పంచాయతీలకుగాను 16 సచివాలయాలు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. అప్పటికప్పుడు కొన్నిచోట్ల తాత్కలిక భవనాల్లో ఈ సచివాలయాలను ఏర్పాటు చేశారు. 2020లో ప్రారంభమైన ఈ సచివాలయ వ్యవస్థకు అవసరమైన భవన నిర్మాణాలకు అప్పట్లో ప్రభుత్వం అనుమతించింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.45 లక్షలుగా నిర్ణయించింది. ఈ మేరకు వైసీపీ నాయకులు వాటి నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకున్నారు. కొన్ని సచివాలయా భవనాలు పూర్త య్యాయి. అయితే వాటి బిల్లులను ప్రభుత్వం సరిగా విడుదల చేయకపోవడంతో తమకు బిల్లుల మంజూరు కావేమోనని కొన్నింటిని అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఈ పరిస్థితుల్లో ఆ భవన నిర్మాణాలు పూర్తి అవుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకమే. వాటిని ప్రభుత్వానికి అప్పగించాల్సింది వైసీపీ నాయకులు కావడంతో ఈ నిర్మాణాలపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. అయినా 6 నెలల్లో పూర్తి చేసి ప్రారంభించాల్సి భవనాలను నాలుగేళ్ల పాటు పూర్తి కాకపోయినా అప్పట్లో వైసీపీ ప్రభుత్వమే పట్టించుకోలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వంపై అది అదనపు భారమే అవుతుందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.


అసంపూర్తిగా ఉన్న తడకండ్రిగ సచివాలయం-2

త్వరలో టిడ్కో ఇళ్ల పంపిణీ: కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 2: అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను రూ.11 కోట్లతో పూర్తి చేయించి లబ్ధిదారులకు అందిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. తిరుపతి - వెంకటగిరి రోడ్డు మార్గంలో ఉన్న టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న వారు అక్కడి సమస్యలను ఆయన దృష్టికి తీసుకు రావడంతో శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇళ్ల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ఉండడంతో వాటిని ఆయన స్వయంగా తొలగించారు. నెలలో ఒక్క రోజు చుట్టుపక్కల వాళ్ళ శ్రమదానం చేస్తే పరసరాలు శుభ్రంగా ఉంటాయని చెప్పారు. అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించి సంబంధిత అధికారులను సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఓ ఇంటికి టూలెట్ బోర్డును పెట్టడాన్ని గుర్తించిన ఆయన వెంటనే ఆ ఇంటి యజమానికి ఫోన్ చేశారు. ప్రభుత్వం ఇల్లు కేటాయించింది బాడుగలకు ఇవ్వడానికి కాదన్నారు. తమకు కేటాయించిన ఇంటిని ఎవరైనా అద్దెకు ఇచ్చినట్టు తేలితే దాన్ని రద్దు చేసి అర్హులకు కేటాయిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు పి.రాజేశ్వరావు, బి.రాజేశ్వరావు, ఏ.సత్యనారాయణ, పి.చంద్రమౌళిరెడ్డి, మల్లారం బాబు, గల్లా శ్రీనివాసులు సహా మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, టిడ్కో ఈఈ ఉమాశంకర్ శాస్త్రి, డీఈ రంగయ్య, ట్రాన్స్‌కో ఏఈ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు... వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రత్యే నిధులను కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. కళశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందించారు. కళాశాలలో ఎనిమిది అదనపు గదులు, కంప్యూటర్ ల్యాబ్ సహా పది కంప్యూటర్లను సమకూర్చాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రవీంద్రబాబు ఎమ్మెల్యేను కోరారు. మధ్యాహ్న భోజన పథకం, వివాదంలో క్రీడా ప్రాంగణాన్ని విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే చెప్పారు.


టిడ్కో గృహాల వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కురుగొండ్ల తదితరులు

ఇస్రో భావి శాస్త్రవేత్తలు మీరే

షార్ డైరెక్టర్ రాజరాజన్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట, ఆగస్టు 2: సమాజానికి ఉపయోపడే పరిశోధనలు చేయాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం పుదుచ్చేరిలోని ఆచార్య ఇంజినీరింగ్ కళాశాలలో భారత ప్రభుత్వం, ఇస్రో, షార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 వంటి సంక్లిష్టమైన ప్రయోగాన్ని భారత్ సుసాధ్యం చేసి చూపించిందన్నారు. ఈ ప్రయోగం భవిష్యత్తులో చేపట్టే ప్రయోగాలకు స్ఫూర్తిదాయకమన్నారు. గగన్‌యాన్, చంద్రయాన్-4 ప్రయోగాలే తమ ముందున్న లక్ష్యమని ఇదే స్ఫూర్తితో శాస్త్రవేతలు కూడా పనిచేస్తున్నారన్నారు. భావి శాస్త్రవేత్తలను తయారు చేయడానికే స్పేస్ డే సంబరాలు నిర్వహించి ఇస్రో చేపట్టే ప్రయోగాలు, ఉపగ్రహాలు రూపలకల్పన తదితర వాటి గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలపై ఆసక్తి కలుగుతుందన్నారు. అనంతరం ఆయన కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పేస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల రూపకల్పన, వాటి పనితీరు తదితరాలను వీడియో ద్వారా ప్రదర్శించారు. షార్ సీనియర్ ఉద్యోగులు, కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతోనే క్యాన్సర్

గూడూరు, ఆగస్టు 2: మన జీవనశైలిలో మార్పుల కారణంగా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ అధికారి లక్ష్మి అన్నారు. పట్టణంలోని త్యాగరాజవీధిలో ఉన్న ప్రైవేటు ఫంక్షన్‌హాలులో సునీత సేవా సంస్థ సహకారంతో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్లాస్టిక్ కవర్లలో వేడిపదార్థాను తినడం, జంక్‌ఫుడ్, రసాయన అవశేషాలు ఉన్న కూరగాయలు తినడం వలన, పొగాకు, మద్యం వినియోగించడం వలన క్యాన్సర్ వస్తుందన్నారు. సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మీ, కన్యాకుమారి, ఉమాదేవి, పద్మజ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: విపరీతంగా మరిగిన నూనెలతో చేసే వంటకాలను తింటే క్యాన్సర్ వస్తుందని స్విమ్స్ వైద్యాధికారి ఏ.వి. చైతన్యభాను అన్నారు. తిరుపతి స్విమ్స్ వైద్య బృందం ఆధ్వర్యంలో నాయుడుపేట మండలం విన్నమాల, శ్రీనివాసపురంలలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి నోరు, రొమ్ముభాగం, గర్భాశయం, ఊపిరితిత్తులు, వృషణాల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వికాస్, శంకరయ్య, జి. హరిత, చంద్రమోహన్, టీడీపీ తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి రాజేంద్ర, నాయకులు ఆళ్ల రాజారెడ్డి, శ్రీనివాసులు, న్యాయవాది పనబాక గంగరాజు, గంగబాబు, పంచాయతీ కార్యదర్శి గోవిందయ్య, వీఆర్వో మునస్వామి తదితరులు పాల్గొన్నారు.


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మి

శాకంబరిగా పార్వతీ దేవి


కూరగాయల అంకరణలో పార్వతీదేవి - నారాయణమ్మ ఆలయానికి కూరగాయల అలంకరణ

సూళ్లూరుపేట/ గూడూరు, ఆగస్టు 2: సూళ్లూరుపేట పట్టణంలోని గంగా పార్వతీ సమేత త్రినేత్ర సంభూత నాగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పార్వతీదేవిని శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గూడూరు పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం ఆషాఢ మాసం శుక్రవారం పూజలను నిర్వహించారు. స్థానిక సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి శాకంబరిగా పూజలు జరిపారు. స్థానిక రాజరాజేశ్వరిదేవి, కన్యకాపరమేశ్వరిదేవి తదితర అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఎస్సీ వర్గీకరణ సానుకూలతపై హర్షం

గూడూరు అర్బన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం సానుకూలంగా వ్యవహరించడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పోస్టాఫీసు సమీపంలోని అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు సాగించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి న్యాయం చేయాలన్నారు. శ్రీనివాసులు, పెంచలయ్య, పౌలు, సుందరం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: ఎస్సీ నోటిఫికేషన్‌ను కేంద్రప్రభుత్వమే జారీ చేయాలని న్యాయవాది హరి కోరారు. ఎస్సీల నోటిఫికేషన్ పరిధి ప్రతి రాష్ట్రానికి మారుతుందన్నారు. ఆయా రాష్ట్రాలకు సంబంధించి రాష్ట్రపతి నిర్ధారించి అధి కారికంగా నోటిపై చేయాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్‌లో మెజార్టీ పొంది 341 ఆర్టికల్‌కు సవరించి వర్గీకరించాల్సి ఉంటుందన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి

ఓజిలి, ఆగస్టు 2: తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి మెండుగా ఉంటుందని, పుట్టిన బిడ్డకు టీకా వంటిదని నాయుడుపేట సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. ఓజిలి మండలంలోని అరిమేనిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలాయపల్లి మండలం మస్తకావేరి, గూడూరు పట్టణం, కోట మండలం విద్యానగర్, చిల్లకూరు మండలం తిక్కవరం ఎస్టీకాలనీలో, వాకాడు మండలంలో, చిట్టమూరు మండలం మండలంలోని గునపాడు, పెళ్లకూరుల్లో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి

చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చండి


మంత్రి నారాయణలో నాగేంద్రప్రసాద రెడ్డి తదితరులు

పెళ్లకూరు, ఆగస్టు 2: మండలంలోని అత్యధిక ఆయకట్టు కలిగిన చెంబేడు చెరువును ఆధునికీకరించి మినీ రిజర్వాయర్‌గా మార్చాలని సర్పంచుల సంఘ రాష్ట్ర కార్యదర్శి డి.నాగేంద్రప్రసాద రెడ్డి శుక్రవారం అమరావతిలో రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి జలవనరుల శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా శిరసనంబేడు, సీఎన్‌పేట, బంగారంపేట పునబాక తదితర గ్రామాలలో వందలాది ఎకరాలు పరిశ్రమల స్థాపన కోసం గత టీడీపీ ప్రభుత్వం సేకరించిందని ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో కలసి మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

సూళ్లూరుపేట, ఆగస్టు 2: చోరీ కేసులో నిందితుడి మల్లు మునస్వామిని శుక్రవారం శ్రీహరికోట పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 29న మండల పరిధిలోని అట్టకానితిప్ప గ్రామంలో హెచ్.లక్ష్మి ఇంట్లో చోరీ జరిగింది బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీహరికోట ఎస్‌ఐ రఘునాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన మల్లు మునస్వామిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి నుంచి 6 సవర్ల బంగారు ఆరణాలతో పాటు రూ.3 వేలు నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ఇన్‌చార్జి తహసీల్దారు లేకుండా...!

ఓజిలి, ఆగస్టు 2 : మండలానికి ఇన్‌చార్జి తహసీల్దారు లేరంట... ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన నాంచారయ్య గత నెల 27న బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అయితే ఇన్‌చార్జి తహసీల్దారు బాధ్యతలను అప్పగించాలేదు. మండలం నుంచి బదిలీపై వెళ్తూ తహసీల్దారు నాంచారయ్య ఇక్కడి డిప్యూటీ తహసీల్దారు మధుసూదనరాజుకు చార్జి అప్పగించారు. అయితే ఇన్‌చార్జి బాధ్యతలు మాత్రం తనకు అప్పగించలేదని డిప్యూటీ తహసీల్దారు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 2: నియోజకవర్గ పరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఐదుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను, ఒక మహిళకు కుట్టు మెషిన్‌ను అందజేశారు. ఎల్ఎస్ ప్రాజెక్టు నిర్వాహకుడు వాసు సహకారంతో వాటిని అందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు తన సొంత నిధుల నుంచి రూ.10వేలు అందించారు. పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పి.నాగరాజు, సిద్దయ్యనాయుడు, భారతి, జీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అన్నక్యాంటీన్ ఏర్పాట్లును ఎమ్మెల్యే పరిశీలించారు. గ్రామసేవకుల న్యాయమైన డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడుతానని చెప్పారు. శుక్రవారం స్థానిక గ్రామసేవకుల భవనంలో గ్రామసేవకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, రమణయ్య, సుబ్బయ్య, సురేంద్ర, మల్లికార్జున్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు, ఆగస్టు 2: గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి భ్రూణ హత్యలను తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో స్త్రీ పురుషులు సమానమని, ఆడపిల్లల పట్ల వివక్ష చూపకూడదన్నారు. వైద్యశాఖ అధికారులు ప్రతినెలా స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని సెంటర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసినవారు 102, 104 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మస్తానమ్మ, వివిధశాఖల అధికారులు శిరీషా, బాబునెప్రాంరెడ్డి, సంపూర్ణ, గిరిజ, మెహబూబి, రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రైవేటు లేబోరేటరీలను డిప్యూటీ డీఎంహెచ్‌వో మస్తానమ్మ తనిఖీ చేశారు.

సీఐటీయూ ర్యాలీని విజయవంతం చేయండి

గూడూరు, ఆగస్టు 2: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 5న పట్టణంలో నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక భవననిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సుదూరప్రాంతాల నుంచి ఇసుక తీసుకురావాలంటే ట్రాక్టర్‌కు రూ.6వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రీచ్‌లను అందుబాటులోకి తీసుకువస్తే ధరలు తగ్గి పనులు పెరుగుతాయన్నారు. శంకరయ్య, శివకుమార్, రఫీ, మధు, కృష్ణయ్య, శ్రీనివాసులు, బీవీరమణయ్య, ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య చిరస్మరణీయుడు

● గురుకులం ప్రిన్సిపాల్ రూత్ రమోలా

నాయుడుపేట, ఆగస్టు 2: భారతదేశ జెండా రూపకర్త పింగళి వెంకయ్య చిరస్మరణీయుడని పుదూరు బాలికల పాఠశాల, కళాశాల గురుకులం ప్రిన్సిపాల్ రూత్ రమోలా అన్నారు. శుక్రవారం పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయనకు గురుకులంలో నివాళి అర్పించారు. 19 సంవత్సరాల వయసులోనే వెంకయ్య ఆర్మీలో చేరారన్నారు. బ్రిటన్ జాతీయజెండాకు వందనం చేయాల్సి వచ్చినప్పుడు ఆయన మదిలో భారతీయ జెండా రూపుదిద్దుకుందన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ జెండా ఆవిష్కర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా రూపకల్పన, జాతిపిత మహాత్మగాంధీతో పింగళి ఉన్న సన్నిహిత సంబంధాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శర్మ వివరించారు. అధ్యాపకులు విక్టోరియా రాణి, శ్రీనివాస్, జీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



కోట, ఆగస్టు 2: పట్టణంలోని విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం పలు పాఠశాలల హెచ్ ఎంలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. 1 నుంచి 10 తరగతులకు సంబంధించిన 77 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, పాఠశాలలతోపాటు గురుకుల పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. అదే విధంగా పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కూడా ఎంఈవో దారా మస్తానయ్య పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు

గూడూరు, ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపట్టినట్లు ఎంఈవో కాంచన తెలిపారు. శుక్రవారం చవటపాళెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జనసేన నాయకులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తాగునీటి సమస్యపై జనసేన నాయకులు ఫిర్యాదు చేశారని ఈమేరకు తనిఖీ చేశామన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడి సమస్యను పరిష్కరించామన్నారు. త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఇంద్రవర్ధన్, చంద్రనీల్, రాజశేఖర్, సూర్యప్రతాప్, విష్ణు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.